## కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ధర్నా

కంఠేశ్వర్ జూన్ 23 : బెస్ట్ అవైలబుల్ స్కూల్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదువుతున్న ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన సామాజిక వర్గం విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 26,000 మంది విద్యార్థులు ఈ స్కీంలో చదువుతుండగా ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు 300 కోట్ల రూపాయల ఫీజు బకాయిలు పాఠశాలలకు చెల్లించకపోవడంతో పాఠశాలల యజమాన్యం ప్రస్తుత విద్యా సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద విద్యార్థులను చదువుకోడానికి అనుమతించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అయోమయంలో పడిందన్నారు. పాఠశాలలు ప్రారంభమై 12 రోజులు గడుస్తున్నా కూడా విద్యాసంస్థల నుంచి తల్లిదండ్రులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదన్నారు. ప్రభుత్వం తరఫునుంచి రావాల్సిన బకాయి రావడంలేదని, కావాలనుకుంటే ఫీజులు చెల్లించి పాఠశాలకు పంపాలని లేనిపక్షంలో పిల్లల్ని పాఠశాల తీసుకురావద్దని యాజమాన్యం చెప్పడంతో గత్యంతరం


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :104 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 24-06-2025 | పేజీలు:4 వెల: 2.00


## హర్మూజ్ జలసంధి మూసివేత..! ప్రపంచ ఆయిల్ మార్కెట్‌పై ప్రభావం తప్పదు..!



టెహ్రాన్:అమెరికా దాడికి నిరసనగా హర్మూజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. అయితే, తుది నిర్ణయానికి అత్యున్నత భద్రతా సంస్థ ఆమోదం అవసరం. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే ఈ ఇరుకైన మార్గం ద్వారా ప్రపంచంలో పెద్ద చమురు వ్యాపారం జరుగుతుంది. అలాంటి దీన్ని మూసివేస్తే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరగనున్నాయి. ఈ మార్గాన్ని ఇరాన్ మూసివేయకుండా ఆపాలని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో చైనాను కోరారు. అయితే, భారత్‌లో కొన్ని వారాల పాటు ఇంధన అవసరాలు తీర్చేందుకు తగినంత చమురు అందుబాటులో ఉన్నది. భారత్ అనేక మార్గాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటుందని పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు కాగా.. గ్యాస్ దిగుమతిలో నాలుగో స్థానంలో ఉన్నది. ప్రభుత్వం రెండు వారాలుగా పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని.. ప్రధాని మోదీ నాయకత్వంలో గత కొన్ని సంవత్సరాలుగా సరఫరాను వైవిధ్యంలో తీసుకువచ్చామని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేర్కొన్నారు. ఇప్పుడు హర్మూజ్ జలసంధి నుంచి ఎక్కువగా తీసుకురావడం లేదని పేర్కొన్నారు. భారత్ మొత్తం రోజుకు 55లక్షల బ్యారెల్స్ చమురు దిగుమతిలో దాదాపు 20 లక్షల బ్యారెల్స్ మాత్రమే ఈ జలసంధి ద్వారా వస్తున్నది. అయితే, గతకొన్ని సంవత్సరాలుగా రష్యా, అమెరికా, బ్రెజిల్ తదితర దేశాల నుంచి చమురు సరఫరాను పెంచింది.

రష్యా నుంచి వచ్చే చమురు హర్మూజ్ ద్వారా రాదు..

రష్యా నుంచి వచ్చే చమురు హర్మూజ్ మార్గం ద్వారా రాదు. ఇది సూయజ్ కాలువ.. కేప్ ఆఫ్ గుడ్ హెూప్.. పసిఫిక్ మహాసముద్రం ద్వారా వస్తుంది. యూఎస్, పశ్చిమ ఆఫ్రికా, లాటిన్ అమెరికా నుంచి సరఫరా ఖరీదైనప్పటికీ ఆచరణీయమైన ఎంపికగా మారాయని.. ఇంధన సరఫరా స్థిరత్వాన్ని నిర్ధారించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి తెలిపారు.

భారతదేశ ఇంధన భద్రత..

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలోని జాతీయ భద్రతా అధ్యయనాల ప్రత్యేక కేంద్రంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్ కుమార్ బెహెరా మాట్లాడుతూ.. ఈ ఇరుకైన మార్గాన్ని మూసివేయడం ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్కెట్లపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని, భారతదేశ ఇంధన భద్రతను కూడా ప్రభావితం చేస్తుందని అన్నారు. భౌగోళిక రాజకీయ సంక్షోభానికి దారితీసే ఈ ముఖ్యమైన షిప్పింగ్ మార్గంలో ఏదైనా అంతరాయం ఇరాక్, కొంతవరకు సౌదీ అరేబియా, భారతదేశం ముడి చమురు దిగుమతులను ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు.

పెరగనున్న బీమా ప్రీమియంలు..

గల్ఫ్ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్న భారత నావికాదళ మాజీ ప్రతినిధి కెప్టెన్ డీకే శర్మ (రిటైర్డ్), హోర్ముజ్ జలసంధిని మూసివేస్తామన్న హెచ్చరికలు ఇరాన్ ప్రపంచ చమురు వాణిజ్యానికి గణనీయమైన అంతరాయం కలిగిస్తుందని అన్నారు. షిప్పింగ్‌లో ఏదైనా అంతరాయం బీమా ప్రీమియంలపై ప్రభావం చూపుతుందని, చమురు రవాణా మరింత ఖరీదవుతుందని పేర్కొన్నారు.

చమురు ధరలు పెరుగుతుందనే భయం

ఈ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తత కారణంగా చమురు ధరలు ఇప్పటికే పెరిగే అవకాశం ఉందని శర్మ అన్నారు. ఇలాంటి పరిస్థితిలో ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటే.. ధరలు బ్యారెల్‌కు 80-90 నుంచి వంద బ్యారెల్‌కు వంద డాలర్లకు చేరుకోవచ్చని అంచనా. ప్రాంతీయ దేశాల కరెన్సీ అస్థిరత.. పెట్టుబడిదారులు ఇతర స్థిరమైన మార్కెట్ల వైపు మొగ్గు చూపవచ్చని.. ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతుందని కూడా ఆయన అన్నారు.

ఇరాన్ చాలా నష్టపోతుంది: రూబిన్

హర్మూజ్ మార్గాన్ని మూసివేస్తే ఇరాన్ చాలా నష్టపోతుందని యూఎస్ డిఫెన్స్ హెడ్‌క్వార్టర్స్ పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్ అన్నారు. ఆసియాకు వెళ్లే చమురులో 44 శాతం ఈ మార్గం గుండానే వెళుతుందని ఆయన అన్నారు. ఇందులో ఎక్కువ భాగం చైనాకే వెళుతుందని ఆయన అన్నారు. ఇరాన్ హర్మూజ్ మార్గాన్ని మూసివేయడానికి ప్రయత్నిస్తే.. అమెరికా ప్రతిస్పందన ఇస్తుందని అమెరికన్ ఉగ్రవాద ఆర్థిక విశ్లేషకుడు జోనాథన్ స్కాంజర్ అన్నారు. బ్రిటన్, ఫ్రాన్స్ నుంచి మద్దతు ఇస్తాయని.. ఇరాన్ చర్య ఆత్మహత్యా సదృశ్యమేనని పేర్కొంటున్నారు.

పశ్చిమాసియాతో భారతదేశం వాణిజ్యంపై ప్రభావం

యుద్ధం తీవ్రతరం కావడం ఇరాక్, జోర్డాన్, లెబనాన్, సిరియా, యెమెన్ వంటి పశ్చిమాసియా దేశాలతో భారతదేశం వాణిజ్యంపై భారీ ప్రభావాన్ని చూపుతుంది. భారతదేశం వారికి 8.6 బిలియన్ డాలర్లు ఎగుమతి చేస్తుంది. 33.1 బిలియన్ల డాలర్లు దిగుమతి చేస్తుంది. హర్మూజ్ మార్గాన్ని మూసివేయడం వల్ల సరుకు రవాణా కూడా పెరుగుతుంది. ముడి చమురును మోసుకెళ్లే ప్రతి నాల్గవ నౌక ఇక్కడి నుంచే వస్తుంది. ప్రపంచంలోని రోజువారీ చమురు సరఫరాలో 30శాతం ఇక్కడి నుంచే వస్తుంది.

## అక్కడ కాంగ్రెస్ గెలిస్తే రేవంత్ క్రేజ్ మరింత పెరుగుతుందా..?



హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత పార్టీ నేతల నుంచి ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాజకీయంగా మాత్రం ఒక్కో పరీక్షలో విజయం సాధిస్తూ తన పట్టు నిలుపుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే త్వరలో జరిగే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలతో పాటు.. గ్రేటర్ హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుని తన పట్టు నిలుపుకునేందుకు రేవంత్ కొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు. రేవంత్ ముఖ్యమంత్రి అయ్యాక కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మొదలైన విజయ పరంపరను.. ఇప్పుడు జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ ఉప ఎన్నికల్లో కొనసాగించాలని పట్టుదలతో ఉన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక విషయానికొస్తే బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు గెలిచిన మాగంటి గోపీనాథ్ ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. దీంతో అసెంబ్లీ సీటు ఖాళీ అయింది. ఇందుకు సంబంధించి శాసనసభ సెక్రటరీ గెజిట్ కూడా ఇచ్చారు. అటు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పూర్తి సమాచారం చేరింది. త్వరలో ఇక్కడ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల కానుంది. అందరికంటే ముందుగా అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఉప ఎన్నికపై కాస్త ఎక్కువ ఫోకస్ పెట్టినట్టు కనిపిస్తోంది. ఉప ఎన్నికలలో ఎట్టి పరిస్థితులలోను విజయం సాధించేందుకు గాంధీభవంలో ఆల్రెడీ చర్చలు మొదలయ్యాయని తెలుస్తోంది. ఇది బీఆర్ఎస్ సిట్టింగ్ సీటు.. అయినా ఈ టైంలో కాంగ్రెస్ పార్టీ గెలిచి తన ఖాతాలో వేసుకుంటే పార్టీకి మంచి ఊపు వస్తుంది అన్నదే రేవంత్ రెడ్డి వ్యూహం. వాస్తవానికి కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లోను బీఆర్ఎస్ సిట్టింగ్ సీటును కాంగ్రెస్ లాగేసుకుంది. అది రేవంత్‌కు అధిష్టానం దగ్గర ప్లస్ పాయింట్ అయ్యింది. గత ఎన్నికలలో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పోటీ చేశారు. మజ్లిస్ తరపున నవీన్ యాదవ్ బరిలో ఉన్నారు. ఎన్నికల తర్వాత నవీన్ యాదవ్ కాంగ్రెస్ లో చేరారు. ఇలా అన్ని రకాల బలాబలాలు కలుపుకుంటే జూబ్లీహిల్స్ లో గెలిచి గ్రేటర్లో సత్తా చాటాలని రేవంత్ ఇప్పటికే పావులు కదుపుతున్నట్టు సమాచారం. ఎన్నికల తర్వాత మజ్లిస్ - కాంగ్రెస్ దోస్తీ బాగుంది. మజ్లీస్ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ కు అనుకూలంగా వ్యవహరించగా.. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మజ్లిస్ అధినాయకత్వం రేవంత్ రెడ్డితో బాగా సఖ్యత ఉంటుంది. ఈ నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీ ఓట్లు కీలకం. ఎంఐఎం ఓటు బ్యాంకు ఎక్కువే.. మజిలీస్ కార్పొరేటర్లు కూడా ఉన్నారు. కాంగ్రెస్ %-% ఎమ్ఐఎం మద్దతుతో జూబ్లీహిల్స్ లో బాగా వేయాలని పావులు కదుపుతోంది. ఎంఐఎం బరిలో దిగకుండా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తే ఖచ్చితంగా వార్ వన్ సైడ్ అవుతుందన్న అంచనాలు ఉన్నాయి. ఇక కాంగ్రెస్ ఆశావాహులు జాబితాలో గతంలో ఓడిపోయిన అజరుద్దీన్ మరోసారి తనకు ఛాన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. నవీన్ యాదవ్ కూడా హస్తం గుర్తు మీద ఒక ఛాన్స్ అంటున్నట్టు తెలుస్తోంది. అటు పిజేఆర్ కుమార్తె విజయా రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ కూడా టికెట్ రేసులో ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఖచ్చితంగా కాంగ్రెస్ ఆశావాహుల జాబితా మరింత పెరుగుతుందని అంటున్నారు. మరి రేవంత్ ఎవరికి టిక్కెట్ ఇప్పించుకుని ఇక్కడ కాంగ్రెస్ ని గెలిపించుకుంటారో చూడాలి.

## శత్రువు పెద్ద తప్పు చేసింది.. శిక్షించాల్సిందే..



టెహ్రాన్:ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులను ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు అమెరికా, ఇజ్రాయెల్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తమపై దాడి చేసిన వారికి కఠినమైన, నిర్ణయాత్మకమైన శిక్ష ఉంటుందని హెచ్చరించారు. అమెరికా దాడుల తర్వాత ఖమేనీ తొలిసారి స్పందించారు. శత్రువులు కఠినమైన శిక్షణు ఎదుర్కొంటారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'దాడులు కొనసాగుతాయి. శత్రువు భారీ తప్పు చేసింది. పెద్ద నేరానికి పాల్పడింది. శిక్షించాల్సిందే. ఇప్పటికే శిక్ష మొదలైంది. అమెరికా, ఇజ్రాయెల్‌కు కఠినమైన, నిర్ణయాత్మకమైన ప్రతిస్పందన ఉంటుంది' అని ఖమేనీ వార్నింగ్ ఇచ్చారు.

అత్యంత సురక్షిత బంకర్‌లోకి ఖమేనీ

ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా బాంబు దాడులతో విరుచుకుపడిన వేళ ఇరాన్ చీఫ్ ఖమేనీ ఎక్కడ ఉన్నారన్న ప్రశ్న అందరిలో తలెత్తుతున్నది. అయితే ఆయన అత్యంత సురక్షితమైన ఒక అండర్‌గ్రౌండ్ బంకర్‌లో ఉన్నారని, ఆయనపై దాడి జరిగేందుకు అవకాశాలున్నందున ఆయన ఉంటున్న ప్రాంతం ఎలాంటి సిగ్నళ్లకు అందకుండా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ వ్యవస్థను కూడా నిలిపివేశారని న్యూయార్క్‌టైమ్స్ వెల్లడించింది. అత్యంత సన్నిహిత వ్యక్తు లు కొందరు ఆయనకు ఎప్పటికప్పుడు యుద్ధ సమాచారాన్ని అందజేస్తున్నారు.

## గప్పాగప్పా గుద్ది.. రప్పారప్పా జైల్‌లో వేయాలి

హైదరాబాద్,పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి.. అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్‌కు మళ్లీ 3.0 ఏంటని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అరవింద్ మండిపడ్డారు. వాళ్ల మొహాలకు మూడు సీట్లు వస్తే గొప్ప అంటూ అన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో సిద్దిపేట జిల్లాలో ఒక్క హరీశ్ రావు తప్ప.. మరెవరూ గెలిచే పరిస్థితి లేదన్నారు. ఆయనకు కూడా ఆ ఒక్క నియోజవర్గంలో ఆదరణ ఉందే తప్పా.. మరెక్కడ లేదని చెప్పారు. ఆఖరికి కేసీఆర్, కేటీఆర్ కూడా ఓడిపోతారని జోష్యం చెప్పారు.

గప్పాగప్పా గుది.. రప్పారప్పా జైలులో వేయాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ జీవితం ముగించాలని ప్రయత్నిస్తున్న ఆమె అన్నయ్య కేటీఆర్ కు కూడా అదే గతి పట్టబోతోందని ఎంపీ అరవింద్ అన్నారు. కాళేశ్వరం స్కామ్‌లో కేసీఆర్‌ను, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ ఉన్నారన్నారు.





గప్పా గప్పా గుద్ది.. రప్పా రప్పా జైలులో వేయాలని.. అలా చేస్తే మరిన్ని స్కామ్‌లు వెలుగులోకి వస్తాయని అన్నారు. అవినీతి కేసుల్లో బీఆర్ఎస్ నేతలను జైలులో పెట్టకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ జీవితం భూస్థాపితం అవుతుందని జోస్యం చెప్పారు.

## కాంగ్రెస్ పాలనలో పథకాల పతనం.. హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పాలనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఎక్స్ (మాజీ ట్విట్టర్) వేదికగా చేసిన వ్యాఖ్యలలో ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం పలు ప్రజా ప్రయోజన పథకాలను నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా బంద్, గ్యాస్ బండకు రాయితీ బంద్, రాజీవ్ యువ వికాసం అమలుకు కాకముందే బంద్, గొర్రెల పంపిణీ మొత్తానికే బంద్.. ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ పాలనలో అన్ని పథకాలు బందయినట్టే అని హరీష్ పేర్కొన్నారు. ఆత్మశుద్ధిలేని యాచార మదియేల, భాండశుద్ధి లేని పాకమేల? అనే సామెతను కోట్ చేస్తూ కాంగ్రెస్ నైతికతను ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రారంభించిన పథకాలను అటకెక్కించి, మేనిఫెస్టోలో ఊదరగొట్టిన హామీల అమలును గాలికి వదిలేశారు అంటూ ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటి పరుగులు తీసినా, చేతల పరంగా మాత్రం ప్రజలు ఇంకా నిరీక్షణలోనే ఉన్నారని హరీష్ వ్యాఖ్యానించారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం లేదని, పాలన అంటే ప్రతిపక్షాలపై కక్ష సాధించడమేనా? అంటూ ఆయన ప్రశ్నించారు. యాదవ, కురుమ వర్గాలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో కాంగ్రెస్ వైఫల్యాన్ని ఆయన ప్రస్తావించారు.



వంద రోజులలో గొర్రెల పంపిణీ చేస్తామని చెప్పిన వాడివి, కానీ ఇప్పటి దాకా డిడి డిపాజిట్ చేసిన వారి సొమ్ము కూడా తిరిగి ఇవ్వలేని దుస్థితి మీది. మాటలు విని విసిగిపోయిన యాదవ, కురుమ సోదరులు గాంధీ భవన్ ముందు గొర్రెలతో నిరసన అని వ్యాఖ్యానించారు. మీ మోసాన్ని ప్రజలు గుర్తుంచుకుంటారు.. ఇంకా జాగ్రత్త పడకపోతే ప్రజల తిరుగుబాటు తప్పదు అని హెచ్చరించారు.

## దూకుడు పెంచిన సిట్.. మాజీ సీఎస్ కీలక వాంగ్మూలం



హైదరాబాద్, జూన్ 23: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) దూకుడు పెంచింది. అందులోభాగంగా సోమవారం ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. అయితే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్( ఎస్ఐబీ) రివ్యూ కమిటీ ప్యానల్‌ను తప్పుదోవ పట్టించిందని తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి వాంగ్మూలం ఇచ్చింది. ఫోన్ ట్యాపింగ్ కోసం ఎస్ఐబీ పంపిన నెంబర్లపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు మాజీ సీఎస్ ఈ సందర్భంగా వాంగ్మూలం ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు స్టేట్‌మెంట్‌ను సైతం సిట్ అధికారులు రికార్డు చేశారు. మావోయిస్టు సానుభూతిపరులు ఉగ్రవాద సంబంధిత సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నారని ఎస్ఐబీ నుంచి రివ్యూ కమిటీకి లేఖ ఇచ్చినట్లు గుర్తించారు. మరోవైపు ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ నేతల వాంగ్మూలాలను సిట్ అధికారులు నమోదు చేస్తున్నారు. ఆ క్రమంలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇక సాధారణ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో రేవంత్ రెడ్డి బరిలో దిగిన సమయంలో.. ఆయనతోపాటు ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఫోన్లు సైతం ట్యాప్ అయినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించారు. అలాగే వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నేత బిళ్ల సుధీర్ రెడ్డి వాంగ్మూలాన్ని సైతం నమోదు చేశారు. ఆ క్రమంలో వాంగ్మూలాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.

### మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన బీఆర్ఎస్ నేత...

బచ్చన్నపేట 23 : బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన పసుల తిరుపతి( 42) (వెంకటేశ్వర్లు) అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నేత కోడూరు శివకుమార్ వెంటనే వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి అంత్యక్రియల గాను ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. చిన్న వయసులోనే తిరుపతి చనిపోవడం బాధాకరం అన్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, ఎవరికి ఎలాంటి ఆపద ఉన్న నేనున్నాన ప్రతి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన శివకుమార్ గౌడ్ ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగపురి బిక్షపతి, పిట్టల ఇస్తారి, తేలు శ్రీనివాస్, యాట రమేష్, కూరమ్ బాలయ్య, కురాము వెంకటేశం, చిలక నర్సయ్య, సొప్పరి సిద్దులు ముదిరాజ్, సంఘం నాయకులు ఉన్నారు.

## అమెరికా నగర వీధుల్లో నిరసనలు.. ఇరాన్‌పై యుద్ధం ఆపాలని డిమాండ్!





వాషింగ్టన్, ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతుంది. ఈ వార్ లోకి అమెరికా ఎంట్రీ ఇవ్వడంతో పశ్చిమాసియా ఒక్కసారిగా భగ్గుమంది. ఈ ఉద్రిక్తతలతో యూఎస్ ప్రధాన నగరాల్లో ఇరాన్‌కి మద్దతుగా నిరసన ప్రదర్శనలు జరుగుతుండడం ఇప్పుడు తీవ చర్చనీయాంశంగా మారింది. ఏకంగా అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ ఆవరణలోనే డొనాల్డ్ ట్రంప్ కి వ్యతిరేకంగా నినాదాలతో ఓ ప్రదర్శన కొనసాగడం గమనార్హం. ఇక, ఇరాన్‌పై యుద్ధం వద్దు.. ఇజ్రాయెల్‌కు సపోర్టు ఇవ్వడం ఆపండి.. గాజాలో నరమేధం ఆగిపోవాల్సిందే అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి పలువురు ఇరాన్ జెండాలను పట్టుకుని నినాదాలు చేశారు. అలాగే, మరికొందరు ఇరాన్‌కు మద్దతుగా రోడ్ల పైకి వచ్చిన పాటలు పాడుతూ తమ నిరసన గళం విప్పారు. ప్రస్తుతం యుద్ధ వ్యతిరేకత నినాదాలతో అగ్రరాజ్యం అమెరికాలోని ప్రధాన నగరాలు.. బోస్టన్, చికాగో, న్యూయార్క్ టైమ్ స్క్వేర్ దగ్గర హ్యాండ్స్ ఆఫ్ ఇరాన్ స్లోగన్లు ఉన్న బ్యానర్లను ప్రదర్శిస్తూ కొందరు నిరసన చేపట్టారు. శ్వేతసౌధం వద్ద జరిగిన నిరసనల్లో పశ్చిమాసియా ఉద్రిక్తతల్లో అమెరికా జోక్యం చేసుకోవద్దని నినాదాలు చేశారు. అయితే, టెహ్రాన్‌పై అమెరికాకు చెందిన B-2 బాంబర్లు దాడులు జరిపి.. తిరిగి ఈ ఉదయం వెనక్కి వచ్చాయి. ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్ పేరుతో కేవలం 25 నిమిషాల్లోనే ఇరాన్ అణు కేంద్రాలైన ఫోర్డో, ఇస్ఫాహన్, నటాంజ్‌లపై దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది.

## సంపాదకీయం

మంగళవారం 24-06-2025

# మనోభావాలు...

మనిషి జీవితంలో ఒక పరిధి మేరకు మాత్రమే మనోబవాలకు ప్రాముఖ్యత నివ్వాలి. మనోభావాల ప్రాతిప దికన సమాజం, ప్రపంచం నడవవు. 'మనిషన్నాక కూసింత కళాపోషణ వుండాలి' అన్నట్టుగానేమనిషన్నాక మనోభావాలూ వుంటా యి. కానీ, అవి వ్యక్తిగతమైనవి. వాస్తవాలు వేరు మనోభావాలు వేరు. కాలక్రమంలో మనోభా వాలు మారు తుంటాయి. కానీ, సత్యం సార్వజ నీనమైనది. మనోభావాల మత్తులో సత్యాన్ని, వాస్తవాన్ని గుర్తించ లేకపోవడం మూర?త్వం. ముఖ్యంగా విద్య, సామాజిక, రాజ కీయ, వైజ్ఞానిక, శాస్త్రీయ, కళా రంగాల్లో మనోభావాలు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయి. ఒక వ్యక్తి మనోభావాలు, మరో వ్యక్తికి గాని, సమాజానికి గాని అక్కరలేనివి. బిజెపి అధికారంలోకి వచ్చాక మనోభావాల పేరుతో మూకదాడులు పెరిగాయి. ప్రజాస్వామ్యంలో భావ ప్రకట నకు చోటు లేకపోతే, అది నియంతృత్వానికి దారితీస్తుంది. 'కళల విషయంలో ఎవరి భావన వారిది' అంటాడు కొడవటిగంటి. సాహిత్య మేధో రంగాల్లో భావ ప్రకటన కీలకమైనది. మాధ్యమం ఏదైనా సమాజం గురించి, జీవితం గురించి తమ అభిప్రాయాలను వారిదైన కళాత్మక ప్రక్రియలో వ్యక్తీకరించేదే భావప్రకటనా స్వేచ్ఛ. మనోభావాల పేరుతో ఆ స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం, భావ ప్రకటన గొంతు నులమడం సమాజానికి శ్రేయస్కరం కాదు, అది ప్రజాస్వామ్యబద్ధం అంతకన్నా కాదు. 'వాక్ స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ.. అన్ని ఇతర స్వేచ్ఛలకు పునాది. అదిలేని ప్రజాస్వామ్యం ఒక ప్రహసనమే' అంటారు అంబేద్కర్. పెరుమాళ్ మురుగన్ దగ్గర నుంచి మేఘా ఎం. వేమూరి వరకూ ఎంతో మందిపై మనో భావాల పేరుతో భౌతికంగా, మానసికంగా దాడులు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో సినిమాలు, రచనలు, స్టాండప్ కామెడీ, కళా ప్రదర్శనలు, నాటకాలపై మనోభావాలు దెబ్బతిన్నా యనే ఆరోపణలు ఎక్కువయ్యాయి. ఒకవైపు వాస్తవా లను, చరిత్రను వక్రీకరించే సినిమాలు చేస్తూనే.. మరోవైపు మనోభావాల పేరుతో 'పికె', 'పద్మావతి' వంటి సినిమాలను నిషేధించాలని కోర్టులకెక్కిన ఘటనలూ వున్నాయి. అదేమంటే.. దాడులకు దిగడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో ఇటీవల కోర్టులు తీసుకున్న వైఖరి భావప్రకటన హక్కుకు ఇచ్చిన గౌరవం ప్రజాస్వామ్యానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' సినిమా విడుదలపై వివాదం, మతం, భాష, ప్రాంతీయ భావోద్వేగాల పేరిట సినిమాలపై నిషేధాలు, బెదిరింపులు పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు భావ ప్రకటన హక్కుకు, ప్రజాస్వామ్యానికి మార్గదర్శకంగా నిలిచింది. 'భారత రాజ్యాంగం ఆర్టికల్ 19 ప్రకారం, ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కు ఉంది. దాన్ని కేవలం ఆర్టికల్ 19(2)లో పేర్కొన్న పరిమితుల వరకు మాత్రమే నియంత్రించవచ్చు. మిగతా ఏ కారణంతోనూ ఆ హక్కును అడ్డుకోవడం చట్టబద్ధం కాదు, సినిమా చూడటం, చూడకపోవడం వ్యక్తిగతమైన హక్కు. ఇతరులకు ఆ హక్కును నిరాకరించే అధికారం ఎవరికీ లేదు' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంతేకా దు- 'మనోభావాలు గాయపడట మనే దానికి అంతులే కుండా పోయింది. ఏదైనా చూసినా, విన్నా, ఎవరోకరి మనోభావాలు గాయప డుతూనే వుంటాయి. ఆ వెంటనే హింస, విధ్వంసం, ఈరోజు ఒక సినిమా అయింది, రేపు ఎవరోకరు ఒక నాటకాన్ని వేయద్దొంటారు. మనం ఏ దిశగా పయనిస్తున్నాం?' అన్న జస్టిస్ భుయాన్ ప్రశ్న అందరినీ ఆలోచింపజేసేదే!'మనకు నచ్చని వారి భావప్రకటనా స్వేచ్ఛ ను మనం గౌరవించకపోతే, మనం స్వేచ్ఛను నమ్మినట్లు కాదు' అంటారు నోమ్ చామ్‌స్కీ. ఈ మాటలు మన సమాజానికొక హెచ్చరిక. దేశంలో సినిమాలు, సాహిత్యం, నాటకాల్లో భావ ప్రకటనా స్వేచ్ఛకు వ్యతిరేకంగా మూక దాడులు, హింస, బెదిరింపులకు మనోభావాలు, భావోద్వే గాలు కారణంగా చెబుతున్నారు. ఈ పేరుతో భావప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోవడమంటే సృజనాత్మకతను, ప్రజా స్వామ్యాన్ని, సామరస్యతను బలహీనపర్చడమే. ప్రజలను బెదిరించే ఈ మూకలు, గ్రూపులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించడమంటే, ప్రజాస్వా మ్యాన్ని పరిరక్షించడమే. భావప్రకటనా స్వేచ్ఛ లేకపోతే, సమాజం జీవితం కోల్పోతుంది.

# ఆటిజంపై జన్యువుల ప్రభావం



సెంట్రల్ డెస్క్:ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అనేది మెదడు అభివృద్ధిలో తేడాల వల్ల కలిగే ఒక రుగ్మత. దీనిని సాధారణంగా మందబుద్ధి అని అంటారు. ఈ రుగ్మత ఉన్న వ్యక్తులు తోటివారితో కలసిమెలసి ఉండకుండా ఒంటరిగా ఉంటుంటారు. తల్లి కడుపులో బిడ్డ ఉన్నప్పటి దశలోనే ఈ ఆటిజం లక్షణాలు సంక్రమిస్తుంటాయి. శిశువు మెదడులో నాడీ కణాల ఉత్పత్తి, వీటి మధ్య సమాచార ప్రసారంలో లోపాలు ఆటిజంకు కారణమవుతున్నాయి. ఆటిజం బారిన పడినవారు సామాజిక సంబంధాలు, ప్రవర్తన, కమ్యూనికేషన్‌లో సమస్యలను ఎదుర్కొంటుంటారు. సామాజిక సూచనలను అర్థం చేసుకోలేరు. ఒకే పనిని పదేపదే చేయడం, కొన్ని వస్తువుల పైనే ఎక్కువ ఆసక్తి చూపడం, కదలికల్లో ఇబ్బంది ఇవన్నీ ఆటిజం లక్షణాలు. శబ్దాలు, వెలుతురు, తాకిడికి భరించలేని సున్నితత్వం. మాట్లాడడం, నడవడం లేదా ఇతర ముఖ్యమైన నైపుణ్యాలు నేర్చుకోవడంలో ఆలస్యం చేస్తుంటారు. ఇటీవల పరిశోధనలో జన్యుపరమైన అంశాలు, పర్యావరణ అంశాలు సంయుక్తంగా ఆటిజంపై ప్రభావం చూపిస్తుంటాయని వెల్లడైంది. ఈ లక్షణాలకు మూలకారణమైన జన్యువులు ఏమిటో తెలుసుకోడానికి పరిశోధనలు చేపట్టగా వాయు కాలుష్యం వంటి పర్యావరణ అంశాలు, తల్లి ఆరోగ్యం ఇవన్నీ జన్యువులతో అనుసంధానమవుతాయని తేలింది. ఆటిస్టిక్ లక్షణాలున్న వారికి, ఆ లక్షణాలు లేనివారికి మెదడు అభివృద్ధిలో తేడాలు కనిపిస్తున్నట్టు పరిశోధకులు తెలుసుకున్నారు. కొన్ని అధ్యయనాలు ఆటిజం బాధితుల్లో మెదడు విపరీతంగా పెరగడం, కార్టికల్ వ్యత్యాసాలను కనుగొన్నాయి. కార్టికల్ వ్యత్యాసాలు అంటే పట్టకట్టు వ్యత్యాసాలు లేదా వల్కల వ్యత్యాసాలు అని చెప్పవచ్చు. ఇది మెదడు బయటిపొర (కార్టెక్స్)లోని నిర్మాణంలో లేదా మందంలో ఉండే తేడాలను సూచిస్తుంది. ఈ వ్యత్యాసాలు, ప్రవర్తన, అభిజ్ఞ సామర్థ్యాలలో తేడాలకు దారితీస్తుంది. కొత్త జన్యువులు, జన్యువుల్లో భేదాలు, అరుదైన ఉత్పరివర్తనాలు, సాధారణ మార్పులు ఆటిజం లక్షణాలతో అనుసంధానమవుతాయని పరిశోధకులు గుర్తించారు. అలాగే నిర్దిష్టమైన ప్రొటీన్లు ఆటిజంతో కలిసి మెదడులోని ఇతర మాలిక్యూల్స్‌తో అనుసంధానమవుతాయని తెలుసుకున్నారు. ఉదాహరణకు జన్యుమార్పు వల్ల సంక్రమించే మైయోటోనిక్ డిస్ట్రోఫీ (డిఎం1)కూడా మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపించి ఆటిజం వంటి లక్షణాలకు దారితీస్తుంది. మయోటోనిక్ డిస్ట్రోఫీ అంటే వారసత్వంగా వచ్చే రుగ్మత. ఇది కండరాల క్షీణత, బలహీనతకు కారణమవుతుంది. దీనినే కండరాల క్షీణత వ్యాధి అని అంటారు. ఆటిజంపై వాయు కాలుష్యం వంటి పర్యావరణ ప్రభావాలపై, గర్భస్రావ సమయంలో తల్లి ఆరోగ్యం ప్రభావంపై కూడా పరిశోధనలు జరిగాయి. దీనివల్ల ఆటిజం రిస్కు ఎక్కువవుతుందని తేలింది. గర్భిణిపై అత్యధిక స్థాయిల వాయు కాలుష్యం ప్రభావం చూపిస్తుందని తేలింది. ముఖ్యంగా మూడో నెల గర్భిణిపై వాయుకాలుష్య ప్రభావం తీవ్రంగా ఉంటే పుట్టిన బిడ్డకు ఆ తరువాత ఆటిజం లక్షణాలు బయటపడతాయని పరిశోధకులు చెబుతున్నారు. ఆటిజం ఉన్న వ్యక్తుల్లో మెదడు అభివృద్ధిలో కార్టికల్ దళసరి, విపరీతంగా పెరగడం, మెదడు నెట్‌వర్క్‌లో తేడాలు కనిపించాయి. ఆటిజం లేని వారితో పోలిస్తే ఆటిజం ఉన్న బాలికల్లో మూడేళ్ల వయసులో మెదడులోని కార్టెక్స్ చాలా దళసరిగా ఉండడం కనిపించింది. ఆటిజం ఉన్న మహిళల్లో వారి బాల్యంలోనే కార్టికల్ సన్నబడడం వేగంగా ఉంటోందని పరిశోధకులు గుర్తించారు. శస్త్ర చికిత్సల అవసరం లేకుండా మెదడును చైతన్యపర్చడం, ప్రెజర్ చాంబర్ థెరపీ అంటే హైపర్‌బారిక్ ఆక్సిజన్ థెరపీ (శుద్ధియైన ఆక్సిజన్‌ను ఒత్తిడిగదిలో పీలుస్తుండడంతో రక్తంలో ఆక్సిజన్ శాతాన్ని పెంపొందించడం) వంటి నూతన చికిత్సలను, ఆవిష్కరణ పద్ధతులను పరిశోధకులు ఇప్పుడు ముందుకు తెస్తున్నారు. బిడ్డ దశలోనే ఆటిజం లక్షణాలను కనుగొనడానికి ఎం చాట్ ఆర్/ఎఫ్ వంటి సమర్థవంతమైన స్క్రీనింగ్ పరికరాలను అధ్యయనంలో ప్రవేశపెట్టారు. ఆటిజం పెరగడానికి జన్యువులు, పర్యావరణ అంశాల మధ్య సమస్యలతో కూడిన పరస్పర చర్యలు ముడిపడి ఉన్నాయని పరిశోధన వెల్లడించింది. ఆటిజం పూర్తిగా నయమయ్యేది కాకపోయినా, తగిన సమయంలో చికిత్స అందిస్తే ఆటిజం పిల్లలు మామూలుగా ఎదిగే అవకాశం కలుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 42 మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం సంక్రమిస్తోందని సర్వేలు చెబుతుండగా మన దేశంలో ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరు దీని బారినపడుతున్నారని ఇండియన్ జర్నల్ ఆఫ్ పీడియాట్రిక్స్ పత్రికలో అధ్యయనం వెలువడింది. ఆటిజం ఎందుకు వస్తుందో ఏయే అంశాలు దోహదం చేస్తున్నాయో ప్రపంచ వ్యాప్తంగా అధ్యయనాలు సాగుతున్నాయి. పుట్టిన తర్వాత రెండేళ్ల వయసులో పాత నాడీ కణాలకు బదులుగా కొత్త కణాలు వచ్చి చేరేటప్పుడు క్రమపద్ధతి లేకపోవడం కూడా కారణం కావచ్చునని భావిస్తున్నారు. అయితే ఆటిజంలో జన్య, పర్యావరణ అంశాల ప్రభావమే ఎక్కువ అని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. 700 కంటే ఎక్కువ జన్యువులు ఆటిజంతో సంబంధం కలిగి ఉన్నాయి. క్రోమోజోమల్ మైక్రోఅరే, తర్వాతి తరం సీక్వెన్సింగ్ వంటి జన్య పరీక్షలను ఉపయోగించి జన్యపరమైన కారణాలను నిర్ధారించవచ్చు. ఇది ప్రారంభ చికిత్సలోనే వ్యాధి భవిష్యత్‌ను అంచనా వేయడంలో సాయపడుతుంది. ఆటిజం జన్యుపరమైన కారణాలను నిర్ధారించడానికి ప్రస్తుతం ఎన్నో పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అబ్బాయిలకి ఫ్రెగైల్ అండ్ టెస్టింగ్ సిఫార్సు చేస్తుంటారు. కొంతమంది అమ్మాయిల్లో ఎంఇసిపి2 జన్యువుల్లో మార్పులను ఆ జన్య పరీక్ష గుర్తించ గలుగుతుంది. ఆటిజంకు కారణమయ్యే జన్యువులను తొలగించడం, నకిలీలను గుర్తించడం వంటి చర్యలను క్రొమోజోమల్ మైక్రోఅరే పరీక్షలు చేపడతాయి. పసిపిల్లల్లో ఆటిజంను ముందుగా గుర్తించడానికి ఎంచాట్, త్రివేంద్రం ఆటిజం బిహేవియరల్ చెక్‌లిస్ట్ సోషల్ కమ్యూనికేషన్ క్వశ్చనేర్ వంటి స్క్రీనింగ్ సాధనాలను వాడవచ్చు. డిఎస్‌ఎం 5 వంటి మార్గదర్శకాలు, ఆటిజం డయాగ్రోస్టిక్ అబ్జర్వేషన్ షెడ్యూల్, ఇండియన్ స్కేల్ ఫర్ ది అసెస్‌మెంట్ ఆఫ్ ఆటిజం వంటి సాధనాలు సమస్యను గుర్తించడానికి ఉపయోగఎడతాయి.

# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం

టెహ్రాన్:ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సంఘర్షణ కేవలం రెండు దేశాల మధ్య మాత్రమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, భద్రత, వాణిజ్యంపై గణనీయమైన దుష్పరిణామాలను కలిగి ఉంది. ఈ యుద్ధం కేవలం తాజా ఘర్షణల పర్యవసానం కాదు, ఇది అనేక దశాబ్దాలుగా పాతుకుపోయిన రాజకీయ, మతపరమైన, వ్యూహాత్మక విభేదాల ఫలితం. ఈ రెండు దేశాలు భౌగోళికంగా పక్కపక్కన లేనప్పటికీ, వాటి మధ్య వైరం పశ్చిమ ఆసియా భౌగోళిక రాజకీయాలకు కీలకమైనది. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం భారత ఆర్థిక వ్యవస్థపై అనేక విధాలుగా ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా, భారత్ ఇంధన అవసరాల కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడి ఉన్నందున ఈ యుద్ధం కీలక పరిణామాలకు దారితీస్తుంది. భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85% దిగుమతులపై ఆధారపడి ఉంది. హార్ముజ్ జలసంధిలో రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా భారతదేశంలో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతాయి. చమురు ధరలు పెరిగితే, పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్(ఎటిఎఫ్) వంటి ఇంధన ధరలు కూడా పెరుగుతాయి. ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దిగుమతి బిల్లు పెరిగి, రూపాయి విలువ బలహీనపడే అవకాశం ఉంది. ఇంధన ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు పెరుగుతాయి. ఇది నిత్యావసర వస్తువులతో సహా అన్ని వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుంది. దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. ఇది సాధారణ ప్రజల కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది. ఇజ్రాయెల్‌కు ఆసియాలో భారతదేశం రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. బాస్మతి బియ్యం, వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు వంటి వస్తువులను భారత్ ఇజ్రాయెల్‌కు ఎగుమతి చేస్తుంది. యుద్ధం వాణిజ్యాన్ని ప్రభావితం చేస్తుంది. మధ్యప్రాచ్య దేశాలకు భారతదేశం చేసే ఎగుమతుల కోసం బీమా ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఇది భారతీయ ఎగుమతిదారులను ప్రభావితం చేస్తుంది. ఎర్ర సముద్రం గుండా వాణిజ్య మార్గాల్లో అంతరాయం ఏర్పడితే, షిప్పింగ్ ఖర్చులు, డెలివరీ సమయాలు పెరుగుతాయి. ఇది అంతర్జాతీయ సరఫరా గొలుసులను దెబ్బతీస్తుంది. మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ అనిశ్చితి పెరిగే కొద్దీ, ప్రపంచ స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు పెరుగుతాయి. భారతీయ స్టాక్



మార్కెట్లు కూడా దీనికి మినహాయింపు కాదు. పెట్టుబడిదారులు అనిశ్చితి సమయంలో బంగారం వంటి 'సురక్షిత ఆశ్రయం' ఆస్తులలో పెట్టుబడులు పెడతారు. ఇది స్టాక్ మార్కెట్ల నుండి నిధులను మళ్లిస్తుంది. అనిశ్చితి పరిస్థితు లలో విదేశీ పెట్టుబడిదారులు భారత్ నుండి తమ పెట్టుబడులను ఉపసం హరించుకోవచ్చు. మధ్యప్రాచ్యంలో ఉన్న భారతీయ కార్మికుల భద్రత, వారి స్వదేశానికి తిరిగి వచ్చే అవకాశం కూడా ఒక ఆందోళన కలిగించే అంశం. భారత్‌కు ఇజ్రాయెల్, ఇరాన్ రెండింటితోనూ మంచి సంబం ధాలు ఉన్నాయి. ఇజ్రాయెల్‌తో రక్షణ, సాంకేతిక, వ్యవసాయ రంగాలలో సహకారం ఉంది. ఇరాన్ నుండి గతంలో పెద్ద ఎత్తున చమురును దిగుమతి చేసుకునేది, ఆంక్షలు ఉన్నప్పటికీ వారితో సంబంధాలను కొనసాగిస్తోంది. ఈ పరిస్థితులలో ఏ వైపు మొగ్గు చూపినా దౌత్యపరమైన సవాళ్లు ఎదురవుతాయి. ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం పశ్చిమ ఆసియాకు తీవ్ర అస్థిరత, ఆర్థిక సంక్షోభం, మానవతా సవాళ్లను తెచ్చిపెడుతుంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో, నియంత్రించడంలో అమెరికా పాత్ర కీలకమైనది. అయితే అది ఇజ్రాయెల్ భద్రతకు తన నిబద్ధతను, ప్రాంతీయ స్థిరత్వాన్ని కొనసాగించాల్సిన అవసరం మధ్య సమతుల్యతను సాధించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఈ యుద్ధం భారతదేశానికి ఆర్థికంగా గణనీయమైన సవాళ్లను ఎదుర్కొనేలా చేస్తుంది. ఇంధనభద్రత, ద్రవ్యోల్బణ నియంత్రణ, వాణిజ్య మార్గాల భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంటుంది.

# ఆషాఢ బోనాలకు రంగం సిద్ధం

హైదరాబాద్, ఆషాడ జాతర వచ్చేస్తుంది. గోల్కొంబోనాలతో ఆషాఢ బోనాల జాతర ఆరంభం కానుంది. అమ్మవారిని తమ ఇంటి బిడ్డగా భావించి అత్త ఇంటి నుంచి పుట్టింటికి తీసుకువచ్చి ఎంతో అందంగా అలంకరించి ధూప నైవేద్యాలతో సారె తో తిరిగి అత్తింటి వారికి పంపించేటటువంటి సాంప్రదాయమే ఈ బోనాల పండుగ.

అంతేకాకుండా వర్షాలు పడేటటువంటి ప్రారంభం. దీంతో పంటలు బాగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకునేటటువంటి పండుగ కూడా.. అలాంటి బోనాల పండుగ అతి దగ్గరలోనే ఉంది. ఆషాడ మాసంలోని తొలి ఆదివారం లేదా తొలి గురువారం గోల్కొండ లోని జగదాంబిక ఆలయంలో నిర్వహించే ఉత్సవాలతో బోనాలు మొదలవుతాయి. అప్పటి నుంచి నెల రోజుల పాటు జరిగేటటువంటి ఈ పండుగ ఎన్నో విశేషాలతో కొనసాగుతుంది. ఈ ఏడాది జూన్ 26 నుంచి జూలై 26 వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. జూన్ 26న గోల్కొండ బోనాలు ఉత్సవాలతో ప్రారంభమవుతాయి. జూన్ 29న విజయవాడ కనకదుర్గమ్మకు బోనం సమర్పిస్తారు. జూలై 13న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఉంటుంది. ఆ తర్వాత రోజు జులై 14న రంగం భవిష్యవాణి.. జులై 20న భాగ్యనగర లాల్ దర్వాజా బోనాల జాతర ఉంటుంది. జులై 21న ఉమ్మడి దేవాలయాల ఘట్టాల ఊరేగింపు నిర్వహించనున్నారు. 24న బోనాల ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ఉంటాయి. నెల రోజులు పాటు జరిగేటటువంటి బోనాలలో భక్తులు రద్దీ నెలకొంటుంది. దేశ విదేశాల నుంచి బోనాల జాతరను చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తారు. ఈ విధంగా ఆషాడ మాసం అనగానే హైదరాబాదులో జరిగే బోనాలు జాతరే గుర్తుకొస్తుంది. ఈసారి ఈ బోనాల జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు కూడా సన్నద్ధమవుతున్నారు.

# కొనసాగుతున్న ఆపరేషన్ సింధు

న్యూఢిల్లీ, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతుండటంతో ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' కొనసాగుతోంది. ఇందులో భాగంగా మరో ప్రత్యేక విమానం టెహ్రాన్ నుంచి శనివారం సాయంత్రం న్యూఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సురక్షితంగా చేరుకుంది. ఇందులో 310 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ వారి కుటుంబ సభ్యులు, అధికారులు సాదర స్వాగతం పలికారు. దీంతో 827 మంది భారతీయులను ఇప్పటివరకూ సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినట్టు కేంద్ర విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. యుద్ధం, ఉద్రిక్తతల నడుమ తమకు సురక్షితంగా తీసుకువచ్చిన భారత ప్రభుత్వానికి విమానాశ్రయానికి చేరుకున్న విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఇరాన్ నుంచి తమను తరలించేటప్పుడు చక్కటి వసతి, లంచ్, డిన్నర్ వంటివన్నీ సకాలంలో అందించారని, తిరిగి స్వదేశానికి రావడం సంతోషంగా ఉందని అల్మాస్ రిజ్వి అనే స్టూడెంట్ తెలిపారు. ఇండియన్ ఎంబసీ ఎంతో సాయం చేసిందని, బారత ప్రభుత్వం తమపట్ల చాలా శ్రద్ధ తీసుకుందని చెప్పారు. ఃూగా, ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా ఈనెల 20వ తేదీన ఇరాన్ నుంచి 290 మంది విద్యార్థులు ఢిల్లీకి చేరుకున్నారు. ఇరాన్ ప్రభుత్వం భారతీయుల కోసం గగనతలాన్ని తెరవడంతో పాటు అక్కడి నుంచి విమానాల ద్వారా సుమారు వెయ్యి మంది భారతీయులను తరలించేందుకు అనుమతించింది. దీనికి ముందు జూన్ 19న 110 మంది భారతీయ విద్యార్థులు అర్మేనియా, దోహా మీదుగా ఢిల్లీకి చేరుకున్నారు.

# కాంగ్రెస్‌లో కొండంత గొడవ..

హైదరాబాద్,కొండా కుటుంబం. కొండా సురేఖ, కొండా మురళి. తెలంగాణలో ఫైర్ బ్రాండ్ కపుల్స్. ఇద్దరూ ఇద్దరే. మాస్ లీడర్స్. మాస్ డైలాగ్స్. మాటలు తూటాల్లా ఉంటాయ్. చేతలు చురకత్తుల్లా దిగుతాయ్. అందుకే సైతం కొండా సినిమా తీశారు. మొదటి నుంచి కాంగ్రెస్ రక్తమే. ఆ తర్వాత వైఎస్ కుటుంబానికి వీర విధేయులు. మధ్యలో కారెక్కినా.. మళ్లీ కాంగ్రెస్‌లో బలమైన నేతలుగా ఉన్నారు. వాళ్ల రాజకీయం వేరే లెవెల్. ప్రోటోకాల్స్, పద్ధతులు గట్రా ఉండవు. తమకు నచ్చింది నచ్చినట్టు చేసుకుపోవడమే. నోటికి వచ్చినట్టు మాట్లాడటమే. అందుకే, మంత్రి కొండా సురేఖ చేసిన పలు కామెంట్స్ ఇటీవల కాలంలో తీవ్ర కలకలం రేపాయి. లేటెస్ట్‌గా కొండా మురళీ మాట్లాడిన మాటలు.. కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టింది.

కాంట్రవర్సీ కొండా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా దంపతులదే హవా. కొత్తగా వాళ్ల కూతురు సుస్మితా పటేల్ సైతం రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. జిల్లా మొత్తం తమదే అంటారు. అన్ని నియోజకవర్గాల్లో వేలు పెడుతుంటారు. మిగతా నేతలతో అంతగా కలవరు. గొడవలూ చాలానే ఉన్నాయి. మేము మోనార్క్. అదే కొండా స్టైల్. ఇలా వారిపై రకరకాల ఆరోపణలు ఉన్నాయి. కొండా కుటుంబంలో ముగ్గురికి మూడు ఎమ్మెల్యే టికెట్లు కావాలంటారు. గత ఎన్నికల్లో ఆ డీల్ కుదరకపోవడంతో వరంగల్ తూర్పులోనే పోటీ చేసి గెలిచారు సురేఖ. వచ్చే ఎన్నికల్లోనైనా పరకాల నియోజకవర్గంలో కూతురు సుస్మితా పటేల్‌ను బరిలో దించాలనేది వాళ్ల టార్గెట్. అందుకే, సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో గిల్లికజ్జాలు పెరిగాయి.

అందరికీ ఒకేసారి ఇచ్చిపడేశారు..

రేవూరిని 75 ఏళ్ల ముసలోడు అంటూ కొండా మురళి బహిరంగంగా కామెంట్స్ చేయడం కాంట్రవర్సీగా మారింది. మరో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కనుబొమ్మలు లేనోడని.. వర్ధన్నపేట ఎమ్మెల్యే, మాజీ పోలీస్ ఆఫీసర్ నాగరాజును ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అని.. వాళ్లంతా దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలంటూ.. సొంత పార్టీ నేతలపైనే తీవ్ర విమర్శలు చేయడం కాంగ్రెస్ పార్టీని షేక్ చేసింది. సురేఖ మంత్రి పదవికి ఢోకా లేదని.. తాము ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోవడం లేదని.. తానే సురేఖకు నెలకు రూ.5 లక్షలు పంపిస్తున్నానంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ కూడా చేశారు. తనకు రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీలే అండా దండా అని చెప్పారు.

కొండా తగ్గేదేలే.. వాళ్లు వదిలేదేలే..

కొండా దెబ్బకు.. ఆయన వ్యతిరేక వర్గమంతా ఏకమయ్యారు. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నాయకత్వంలో భవిష్యత్ కార్యచరణ రెడీ చేశారు. కొండాకు యాంటీగా ఉన్న లీడర్స్ అంతా మీటింగ్‌కు రావడం ఆసక్తికరం. నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, నాగరాజు, బస్వరాజు సారయ్య, గుండు సుధారాణి, ఎర్రబెల్లి స్వర్ణ.. ఇలా బాధితులంతా కలిసి చర్చించుకున్నారు. ఈసారి కొండాను వదిలేదేలేదంటూ తాడోపేడో తేల్చుకునేందుకు సై అన్నారు. కొండా జంట.. జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో వర్గాలను పెంచి పోషించి చిచ్చు పెడుతున్నారని వారంతా కాంగ్రెస్‌లో అంతేనా?కొండా మురళి వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయంటూ.. ఇరు వర్గాల నుంచి కంప్లైంట్స్ వచ్చాయని చెప్పారు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్. ఫిర్యాదులు పరిశీలించిన తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అయితే, కాంగ్రెస్‌లో ఇలాంటివన్నీ కామన్. కొండా లాంటి బలమైన నాయకుడిపై అంత ఈజీగా చర్యలు తీసుకునే అవకాశం లేదని అంటున్నారు పార్టీ శ్రేణులు.

# కలర్ బుక్ ప్రభుత్వాలేనా?

హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. గతంలో రాజకీయంగా ప్రత్యర్థులుగా మాత్రమే ఉండే రాజకీయనాయకుల మధ్య ఇప్పుడు శత్రుత్వమే కాదు.. వ్యక్తిగత కక్షల వరకు పరిస్థితులు వెళ్లిపోయాయి. అందుకు తగ్గట్లే విమర్శలు.. ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. లోకేశ్ షురూ చేసిన రెడ్ బుక్ రాజకీయం ఇప్పుడు అంతకంతకూ విస్తరిస్తోంది. లోకేశ్ నోటి నుంచి తరచూ వచ్చే రెడ్ బుక్ పాలన.. తెలుగు రాజకీయాల్లో సరికొత్త ఆయుధంగా మారింది. దీనికున్న క్రేజ్ ను పరిగణలోకి తీసుకున్న తెలంగాణ విపక్షం బీఆర్ఎస్ ముఖ్యనేతలు సైతం తాము పింక్ బుక్ రాస్తున్నట్లుగా పేర్కొంటున్నారు. మొదట్లో మాట వరసకు అన్నట్లుగా భావించినా.. రోజులు గడుస్తున్న కొద్దీ.. గులాబీ కీలక నేతల నోటి నుంచి తరచూ పింక్ బుక్ ప్రస్తావన రావటంతో.. తెలంగాణ రాజకీయాలు సైతం కలర్ బుక్ రాజకీయాల దిశగా అడుగులు పడుతున్నట్లుగా చెప్పాలి. ఇంతకూ ఈ బుక్ లో ఏముంటుంది? నిజంగానే అందులో ఏం రాసుకుంటారు? అన్న సందేహాలకు తావు లేకుండా విపక్షంలో ఉన్నప్పుడు లోకేశ్ తన వెంట రెడ్ కలర్ అట్ట ఉన్న పుస్తకాన్ని తన వెంట తీసుకొచ్చి.. సభలో మాట్లాడుతున్నప్పుడు కూడా ఆ పుస్తకాన్ని చూపించేవారు. నిజానికి లోకేశ్ ఇమేజ్ బిల్డింగ్ కు రెడ్ బుక్ కాన్సెప్ట కలిసి వచ్చిందని చెప్పాలి. ఆయన చేసిన సుదీర్ఘ పాదయాత్ర కంటే కూడా రెడ్ బుక్ పట్టుకొని.. "ప్రత్యర్థుల సంగతి తేలుస్తా.. అందులో అన్ని రాసుకుంటున్నా.. నా పార్టీకి చెందిన వారి ఇబ్బందుల్ని నమోదు చేసుకుంటా. అంతకంతకూ బదులు తీర్చుకుంటా' అంటూ చెప్పిన మాటలు హైలెట్ అయ్యాయి. లోకేశ్ రెడ్ బుక్ ఆయనకు కొత్త ఇమేజ్ తీసుకురావటమే కాదు.. నేతలు.. కార్యకర్తల్లో నమ్మకాన్ని పెంచేలా చేయటం మిగిలిన పార్టీలకు స్ఫూర్తిగా మారింది.

# పర్యావరణహిత నగరాభివృద్ధికి కృషి

హైదరాబాద్,సొంతింటి కలను సాకారం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమైందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఇల్లు కొనేందుకు రుణాలిచ్చే ముందు అన్ని విధాలా సరి చూసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ వాల్యుయర్స్, రిజిస్టర్డ్ వాల్యుయర్స్ ఫౌండేషన్, ఎక్షు హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ట్రాన్స్‌ఫర్‌మేటివ్ ఎరాలో వాల్యుయేషన్' అంశంపై జరిగిన జాతీయ సదస్సులో రంగనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.సుస్థిర వ్యాపారానికి హైడ్రా దోహదం చేస్తోందని అందరూ గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి మోసాలకు ఆస్కారం లేకుండా సొంతింటి కలను సాకారం చేయడంలో రియల్ ఎస్టేట్ సంస్థలతో పాటు, ఆ ఇంటికి రుణాలు ఇచ్చే అర్థిక సంస్థలు కూడా బాధ్యత వహించాలని రంగనాథ్ సూచించారు.గతేడాది జులై 19న హైడ్రా ఏర్పడిందని.. అంతకుముందు వెలసిన నివాస ప్రాంతాలతో పాటు, అనుమతులు పొంది నిర్మాణ దశలో ఉన్న వాటి జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తామన్నారు. హైడ్రా అంటే కూల్చివేతలు కాదు.. పర్యావరణ హితమైన నగరాభివృద్ధికి దోహదం చేసే సంస్థగా అందరూ గుర్తిస్తున్నారని వివరించారు. సర్వే నంబర్ ఒకటి చూపించి.. వేరే చోట ఇళ్ల నిర్మాణం చేపడుతున్నవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్థిక సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలకు ఆస్తి విలువలను నిర్ణయించడంలో పారదర్శకత, నమ్మకం, కచ్చితత్వాన్ని నిర్ధరించడంలో వాల్యుయేషన్ నిపుణుల పాత్ర చాలా కీలకమైందన్నారు. స్థిరాస్తుల విలువ నిర్ధరించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత ఉపయోగంగా ఉన్నా.. క్షేత్రస్థాయి పరిశీలన కూడా అంతే ముఖ్యమన్నారు. గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి.. వరద ముప్పులేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలనేది హైడ్రా లక్ష్యమని రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే చెరువులు, నాలాలు, పార్కులు, రహదారుల ఆక్రమణలను నిరోధించి.. ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడేందుకు హైడ్రా ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఓఆర్ఆర్ పరిధిలో వెయ్యికి పైగా ఉన్న చెరువుల పునరుద్ధరణ జరిగి.. పార్కులన్నీ పచ్చగా ఉన్నప్పుడు పర్యావరణ సమతుల్యత సాధించగలుగుతామన్నారు.

# షిల్లాంగ్‌లోని జిల్లా షెషన్స్ కోర్టు ఆదేశం

షిల్లాంగ్,హనీమూన్‌కు వెళ్లి హత్యకు గురైన రాజా రఘువంశీ కేసులో ఆయన భార్య, కీలక నిందితురాలు సోనమ్ కి షిల్లాంగ్‌లోని జిల్లా షెషన్స్ కోర్టు 13 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి ఆదేశించింది. ఆమెతో పాటు ఆమె బాయ్‌ఫ్రెండ్, మరో నిందితుడు రాజ్ కుష్వాహకు సైతం జ్యుడిషియల్ కస్టడీ విధించింది. హనీమూన్ ట్రిప్‌లో హత్యకు గురైన రాజ రఘువంశీ కేసు తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ హత్యతో ప్రమేయం ఉన్న సోనమ్, కుష్వాహా, మరో ముగ్గురిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కాగా, సోనమ్, రాజా కుష్వాహాలను జ్యుడిషియల్ కస్టడీలోకి తీసుకోవాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తుషార్ చందా ఆదేశించారు. జ్యుడిషియల్ కస్టడీకి ఇవ్వాలని ఇన్వెస్టిగేటింగ్ అధికారి కోరగా, నిందితుల కస్టడీని పోలీసులు కోరలేదు. కాగా, ఎనిమిది రోజుల కస్టడీలో సోనమ్ పోలీసు ఇన్వెస్టిగేటర్లను సోనమ్ తప్పుదారి పట్టించారని రాజా రఘువంశీ పెద్ద సోదరుడు సచిన్ రఘువంశీ ఇండోర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. కుట్ర పథకాన్ని పూర్తి స్థాయిలో వెలికి తీసేందుకు, నిందితులను మరింత లోతుగా ప్రశ్నించేందుకు పోలీసు రిమాండ్‌ను పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. కీలక సమాచారాన్ని సోనమ్ దాచిపెట్టిందని, మరింత సమగ్ర విచారణ కోసం నిందితులను ఇండోర్‌కు ట్రాన్స్‌ఫర్ చేయాలని అన్నారు. ఈ కుట్రలో సోనమ్ కుటుంబసభ్యులు, సన్నిహితుల ప్రమేయానికి అవకాశం ఉందని, వీరికి నార్కో టెస్టులు జరపాలని కోరారు. ఈ స్థాయిలో హత్యకు ఎ÷-లాన్ చేయడం అంత సులభం కాదని, ఆమెకు సన్నిహితంగా ఉన్న వారిని మరింత లోతుగా విచారించాలని అన్నారు. రాజా రఘువంశీ తల్లి ఉమా రఘువంశీ భావోద్వేగానికి గురయ్యారు. తన కొడుకును ఎందుకు చంపిందో సోనమ్ వివరణ ఇవ్వాలని, నిజం ఆమె నోట వెంట వినేంతవరకూ తనకు శాంతి లేదని అన్నారు. ఈ కేసులో ప్రమేయమున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టకుండా విచారణ జరపాలని దర్యాప్తు అధికారులను కోరారు. మే 11న వివాహం చేసుకున్న రాజా, సోనమ్ దంపతులు మే 20న హనీమూన్ ట్రిప్ కోసం మేఘాలయ వెళ్లారు. మే 23 నుంచి రాజా కనిపించకుండా పోయాడు. అయితే పదిరోజుల తర్వాత జూన్ 2న అతని మృతదేహం ఈస్ట్ కాశీ హిల్స్ జిల్లాలో కనిపించడం సంచలనమైంది. సోనమ్ తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి కిరాయి గూండాలతో ఈ హత్య చేయించినట్టు పోలీసు విచారణలో తేలింది.

# ఆందోళనకరంగా ఉద్యోగాల కల్పన

ముంబై,దేశంలో ఐటి ఉద్యోగాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పలు దిగ్గజ సంస్థలు ఉద్యోగులను ఉన్నపళంగా తొలగించడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. కొత్తగా ఉద్యోగాల కల్పన కూడా అంతంతమాత్రంగానే ఉంటోంది. పట్టాలు పుచ్చుకుని బయటకు వస్తున్న వారిలో చాలామంది ఉద్యోగాలు దొరక్క ఆందోళన చెందుతున్నారు. దేశీయ ఐటీ దిగ్గజ సంస్థలు ఆరేడు త్రైమాసికాలుగా వెల్లడిస్తున్న ఆర్థిక ఫలితాల్లో నికర ఉద్యోగుల సంఖ్య తగ్గడమే కానీ, పెరిగింది లేదు. అయితే తాజా జులై-సెప్టెంబరు ఫలితాల్లో మాత్రం ఇందుకు భిన్నంగా ఉద్యోగుల సంఖ్య పెరగడం, తాజా ఉత్తీర్ణుల ఎంపికలనూ ప్రణాళిక మేరకు చేపడుతున్నామని ఆయా యాజమాన్యాలు ప్రకటించడం.. ఉద్యోగార్థులకు భవిష్యత్తుపై ఆశలు చిగురింప చేశాయనే చెప్పాలి. వివిధ సంస్థల్లో ఉద్యోగుల క్షీణత గణనీయంగా పెరుగుతూ వచ్చింది. కృత్రిమమేధ ప్రాజెక్టుల్లోనూ ఆర్డర్లు వస్తున్నట్లు వెల్లడించడం, అధునాతన సాంకేతికతలపై మన నిపుణులకు ఉన్న సామర్థ్యాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థలు గుర్తించినట్లయ్యింది. కళాశాల ప్రాంగణాల్లో ఎంపిక చేసి, గతంలో ఆఫర్ లెటర్ ఇచ్చిన అందరినీ తప్పనిసరిగా చేర్చు కుంటున్నట్లు ఈ సంస్థలన్నీ ప్రకటించాయి. కానీ జీతాలు పెరిగే కొద్దీ కొత్తవారిని తీసుకుంటూ పాతవారిని తొలగిస్తున్నారు. దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని మోదీ అభివర్ణించారు. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫ్రా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్లు ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్‌మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. అంటూ ప్రధాని ఎక్కడికి వెళ్లినా చెబుతున్నారు. ప్రపంచ భవిష్యత్తును భారత్ నిర్ణయిస్తుంది. మా ప్రభుత్వ మూడో విడత పాలనతో రేటింగ్ ఏజెన్సీలు దేశ వృద్ధిరేటును గణనీయంగా పెంచాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశమని ప్రధాని మోదీ అభివర్ణించారు. పేదల కష్టాలు తమకు బాగా తెలుసన్నారు.

# పొలిటికల్ ట్యాపింగ్‌లో అధికార గణం!



న్యూఢిల్లీ,అత్యధిక ప్రజామోదంతో అధికారం చేపట్టిన రాజకీయ పక్షాలు కూడా తమ ఇష్టానుసారంగా రాజ్యం చేయలేవు. అయితే అధికారంలో ఉన్నప్పుడు కొంతమందికి అవేమీ గుర్తు రావు, మేము ఏం చేసినా చెల్లిపోతుంది అనుకుంటూ ఉంటారు. ప్రస్తుతం తెలంగాణలో వరుసగా రెండుసార్లు ప్రజామోదం పొంది అధికారంలోకి వచ్చి మూడవసారి ఓటమి చవిచూసి ప్రతిపక్షంలో కూర్చున్న భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) అధినాయకత్వం అట్లాగే ఆలోచించిందని జరుగుతున్న పరిణామాలు చూస్తే మనకు అర్థం అవుతుంది. సరే ప్రభుత్వాలు మారగానే ఆ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో చేసిన పనుల్లో జరిగిన అవకతవకలు, అక్రమాల మీద దర్యాప్తులు జరగడం, కేసులు రావడం అనేది ఇటీవల కాలంలో చాలా సాధారణమైపోవడం మనకు తెలిసిందే.అటువంటి ఒకానొక అక్రమ చర్య భారత రాష్ట్ర సమితి రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించి ఓడిపోయేదాకా కొనసాగించింది అని ఆరోపణలు వచ్చాయి. దానిమీద ప్రస్తుత ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం జరుపుతున్న విచారణలో నిర్ఘాంతపరిచే వాస్తవాలు అనేకం బయటకు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘ పోరాటం జరిపి లక్ష్యాన్ని సాధించుకుని వరుసగా తొలి పదేళ్లు అధికారంలో ప్రజామోదంతో కొనసాగిన భారత రాష్ట్ర సమితికి తలవంపులు తెచ్చే వ్యవహారం ఇది. 2018లో రెండవసారి అత్యధిక మెజారిటీ సాధించి 119 స్థానాలకు గాను 81 స్థానాలు గెలుచుకొని రెండవసారి అధికారం చేపట్టాక రాష్ట్రంలో మళ్లీ 2023లో ఎన్నికలు జరిగే వరకు దాదాపు 600 మందిపైన ప్రభుత్వ నిఘా కొనసాగిందని అందుకు సంబంధించిన వివరాలు ఇప్పుడు బయటపడుతున్నాయి.రాష్ట్రంలో నేరాలని పరిశోధించడానికి, అసలు నేరాలే జరగకుండా చూడటానికి,వాటిని అరికట్టడానికి, శాంతిభద్రతలను పరిరక్షించడానికి ఉద్దేశించి పని చేయవలసిన పోలీస్ వ్యవస్థను అధికారపక్షం తన ప్రత్యర్థుల కదలికలు, వారు జరిపే సంభాషణలు తెలుసుకోవడం కోసం దుర్వినియోగపరిచిందని ప్రత్యేక దర్యాప్తు బృందం జరుపుతున్న విచారణలో బయటపడుతున్నది.1885 భారత టెలిగ్రాఫిక్ చట్టంలోని సెక్షన్ 5(2) ప్రకారం ఒక అనుమానిత వ్యక్తి టెలిఫోన్ సంభాషణలు కనుక టాప్ చేయాలనుకుంటే హెూం మంత్రిత్వ శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఫోన్ ట్యాపింగ్ అనేది వ్యక్తుల వ్యక్తిగత గోప్యత (ప్రైవసీ)కు భంగం కలిగించేది కాబట్టి అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఈ చర్యకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఏమిటా అసాధారణ పరిస్థితులు అంటే సదరు వ్యక్తులు దేశభద్రతకు ముప్పు కలిగించే వ్యవహారాలూ చేస్తున్నా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు చేస్తున్నా వాటిని పరిగణనలోకి తీసుకోవచ్చు.తెలంగాణలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉండగా అప్పటి ప్రభుత్వం ఇవేమీ పట్టించుకున్నట్లు లేదు. ఎడాపెడా అనేకమంది టెలిఫోన్ సంభాషణలను ట్యాప్ చేసి నట్టు వివరాలు బయటకు వస్తున్నాయి. ఇట్లా ట్యాప్ చేసిన ఫోన్లలో ప్రత్యర్థి రాజకీయ నాయకులే కాకుండా ఇతర రంగాలకు సంబంధించిన పలువురు, చివరకు జర్నలిస్టులు, న్యాయమూర్తులు కూడా ఉన్నట్టు తెలుస్తున్నది. వీళ్ళంతా ఏ విధంగా దేశభద్రతకు ముప్పు కలిగిస్తారో, ఏ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ప్రమాదం ఉందో ఈ వ్యవహారం నడిపిన వాళ్ళే చెప్పాలి. రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయడానికి లేదా తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే కుట్రను ఛేదించడానికి అప్పుడు అధికారంలో ఉన్నవారు ఈ ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు చెప్తున్నారు. అప్పుడు అధికారాల్లో ఉన్న పక్షం అటువంటిది ఏమీ జరగలేదని పదేపదే చెబుతున్నా రెండు ఉదాహరణలు తమంతట తామే దానిని అంగీకరించినట్టు స్పష్టం చేస్తున్నాయి.ఇటీవల మాజీ శాసనసభ్యుడు గోనే ప్రకాష్ రావు ఒక దగ్గర చెప్పినట్టు కొద్దిమంది టిఆర్ఎస్ శాసన సభ్యులను కొనుగోలు చేసేందుకు హైదరాబాద్ శివారులోని ఒక ఫారం హౌస్‌లో కుట్ర జరిగిందనే ఆధారాలు చూపడం కోసం ఆనాటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు బయటపెట్టిన ఆడియోలే ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నడానికి ఒక ఉదాహరణ. మరొకటి టిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఆ పార్టీలో ముఖ్యుడు, కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా పనిచేసిన వి. ప్రకాష్ ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రభుత్వంలోని ఒక ముఖ్యుడు తన ఫోన్ ట్యాప్ అవుతున్నదని, ఎవరూ తనకు ఫోన్ చేయవద్దని సూచించినట్టుగా చెప్పారు. రాజకీయాల్లో ఉన్నవాళ్ళు తమ నీడను చూసి కూడా అప్పుడప్పుడు దడుచుకుంటారేమో అనుకోడానికి ఈ టెలిఫోన్ ట్యాపింగ్ ఉదంతం మంచి ఉదాహరణ. మాజీ ముఖ్యమంత్రి రక్త సంబంధీకులను కూడా నక్సల్ సంబంధాల పేరుతో ట్యాపింగ్ చేయించడం అందుకు గొప్ప ఉదాహరణ.ఈ ఉదాహరణలు సరిపోతాయి ఫోన్ ట్యాపింగ్ జరిగింది అనడానికి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు జరుపుతున్న ప్రత్యేక బృందం సేకరించిన ఆధారాల్లో పలువురు ప్రత్యర్థి రాజకీయ ప్రముఖులు, ఇతర రంగాల ప్రముఖులు కూడా ఉన్నారు. అటువంటి వారందరినీ సాక్ష్యం కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం తమ ముందు హాజరు కావలసిందిగా నోటీసులు పంపుతుండటం చూస్తున్నాం. నోటీసులు అందుకున్న ప్రముఖులలో పార్లమెంట్ సభ్యులు, ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా ఉండడం విశేషం.2013లో కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్న భారతీయ జనతా పార్టీ నాయకుడు అరుణ్ జైట్లీ ఫిర్యాదు మేరకు పార్లమెంట్ ఏర్పాటు చేసిన హెూం శాఖ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రజాప్రతినిధుల మీద ఇటువంటి ఫోన్ ట్యాపింగ్ అవసరం అయినప్పుడు పార్లమెంట్ సభ్యులు అయితే లోక్‌సభ స్పీకర్ అనుమతి, శాసన సభ్యులైతే శాసన సభాధ్యక్షుడు అనుమతి తప్పనిసరిగా తీసుకుని కానీ చేయడానికి వీలు లేదు. ఇది ఆనాటి పార్లమెంటు ఆమోదం కూడా పొందినట్టు గుర్తు.ఇటువంటి పద్ధతులూ, నిబంధనలు ఏవీ పాటించకుండా తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టుగా అర్థమవుతున్నది. ఇప్పటికే దాదాపు నలుగురు పోలీస్ అధికారులు ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో జ్యుడిషియల్ రిమాండ్‌లో గడిపి బెయిల్ మీద వచ్చి ఉన్నారు. మరొక అధికారి ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ముఖ్యపాత్ర ఉందని చెప్తున్న అప్పటి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో అధిపతి ప్రభాకరరావు కొంతకాలం అమెరికాలో ఉండి సుప్రీం కోర్టు కల్పించిన వెసులుబాటు కారణంగా ప్రస్తుతం అరెస్టు తప్పించుకొని ప్రత్యేక దర్యాప్తు బృందం ముందు హాజరవుతున్నారు. దర్యాప్తులో ఆయన సహకరించడం లేదు కాబట్టి ఇచ్చిన ఆగస్టు అయిదు వరకు ఆయనను అరెస్ట్ చెయ్యరాదంటూ ఇచ్చిన వెసులుబాటును రద్దుచేసి పోలీసు కస్టడీలోకి తీసుకోవడానికి అనుమతించవలసిందిగా సుప్రీం కోర్టును కోరడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం యోచిస్తున్నది .ఆయన ప్రత్యేక దర్యాప్తు బృందంతో సహకరించకపోగా,తాను డ్యూటీ మాత్రమే చేశాను అని చెప్తున్నారు. అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలు ఆదేశించినంత మాత్రాన చట్టవ్యతిరేకమైన, అనైతికమైన వ్యవహారాలు చక్కబెట్టడం తన డ్యూటీలో భాగం కాదన్న విషయం ఈ ఉన్నతాధికారికి ఎందుకు జ్ఞాపకం రాలేదో అర్థం కాదు. ఇక్కడ ఒక విషయం మాట్లాడుకోవాలి. ఒకసారి మొత్తం వ్యవహారాన్ని గురించి ఆలోచిద్దాం. ఆనాటి ముఖ్యమంత్రి తన రాజకీయ ప్రత్యర్థులు లేదా తన అధికారానికి ఇబ్బంది కలిగించే వాళ్లు అనుకున్న వారి కదలికల మీద నిఘా వేయడం కోసం ఈ పోలీస్ వ్యవస్థను ఉపయోగించు కున్నారని అనుకుందాం. రేపు అంతిమంగా నష్టపోయేది ఎవరు? అన్ని రకాలుగా తమ కెరియర్ పరంగా, నైతికంగా కూడా నష్టం జరిగేది ఎవరికి? రాజకీయ నాయకత్వం చెప్పిన పని అనైతికం అనే విషయం గుర్తు చేయకుండా, ఇది చేయకూడదు అని చెప్పకుండా తలలు ఊపి వారి మెప్పు పొందడం కోసం చేసిన పని కారణంగా వాళ్ళు ఎంత నష్టపోతున్నారు అర్థం అవుతున్నది.ఎక్కడా లిఖితపూర్వక ఆదేశాలు లేకుండా వాటిని అమలు పరిచిన వారంతా అన్ని విధాలుగా నష్టపోవడం తప్ప ఈ కేసు చివర్లో సాధించేది ఏమి ఉండదు. రాజకీయ పార్టీలను ప్రజలు ఐదేళ్లకు ఒకసారి ఎన్నుకుంటారు. నచ్చకపోతే మార్చుకుంటారు. అధికార యంత్రాంగం, ఉద్యోగులు మూడు నాలుగు దశాబ్దాలు ప్రజాధనం జీతాలుగా తీసుకుంటూ ప్రజాసేవ చేయడం కోసం నియమితులవుతారు. అంతేకాదు ఎప్పటికప్పుడు అధికారంలో ఉండే రాజకీయ నాయకత్వాన్ని అప్రమత్తం చేసి సరైన మార్గంలో పెట్టవలసిన బాధ్యత అధికార యంత్రాంగానిది. దురదృష్టవశాత్తు రాజకీయపక్షాల కంటే ఎక్కువ లేదా ఆ పక్షాలతో సమానంగా పోటీ పడుతూ అప్రతిష్టపాలు కావడానికి అధికార

# జి7 సదస్సులో భారత్ కీలక ప్రతిపాదనలు

కెనడా,కెనడాలోని కనానస్కిస్‌లో 2025 జూన్ 18 -19 తేదీలలో జరిగిన 51వ జి-7 సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఔట్‌రీచ్ సెషన్‌లో పాల్గొని, ఉగ్రవాదం, ఇంధన భద్రత, కృత్రిమ మేధస్సు (ఎఐ), గ్లోబల్ సౌత్ ఆకాంక్షలపై కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ సమావేశం ప్రపంచ శాంతి, స్థిరమైన అభివృద్ధి కోసం సమష్టి చర్యల అవసరాన్ని నొక్కి చెప్పింది. మోడీ ప్రసంగం భారత్‌ను గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా నిలబెట్టడమే కాక, ఉగ్రవాద నిర్మూలన, స్థిరమైన ఇంధన విధానాలపై దృఢమైన సందేశాన్ని అందించింది. ఈ సమ్మిట్‌లో చర్చించిన అంశాలు, భారత్ ప్రతిపాదనలు, ఇతర దేశాల స్పందనలు ప్రపంచ రాజకీయ, ఆర్థిక డైనమిక్స్‌ను అర్థం చేసుకోవడానికి కీలకమైనవి. జి-7 సదస్సులో ఉగ్రవాదం ప్రధాన అంశంగా నిలిచింది. పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ మోడీ దీనిని మానవత్వంపై దాడిగా అభివర్ణించారు.'ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరి ఉండకూడదు. దీనిని సమర్థించే దేశాలు తగిన మూల్యం చెల్లించాలి' అని ఆయన హెచ్చరించారు. పాకిస్తాన్‌ను పరోక్షంగా ఉగ్రవాద కేంద్రంగా ఆరోపిస్తూ, దాని వత్తాసుతోనే పహల్గాం దాడి జరిగిందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాద నిర్మూలనకు అంతర్జాతీయ సమన్వయం, ఆర్థిక ఆంక్షలు, సమాచార భాగస్వామ్యం అవసరమని సూచించారు. ఈ వ్యాఖ్యలు పాకిస్తాన్‌పై ఒత్తిడి తీసుకురావడంతో పాటు, భారత్ జాతీయ భద్రతా విధానాన్ని ప్రపంచ వేదికపై స్పష్టం చేశాయి. ఇంధన భద్రత మరో కీలక చర్చా అంశం. మోడీ స్థిరమైన, సరసమైన ఇంధన వనరుల అవసరాన్ని నొక్కి చెప్పారు. గ్లోబల్ సౌత్ దేశాలు ఇంధన అనిశ్చితులను ఎదుర్కొంటున్నాయని, సౌర, పవనశక్తి వంటి పునరుత్పాదక వనరులపై పెట్టుబడులు పెంచాలని సూచించారు. భారత్‌లో సౌరశక్తి, గ్రీన్‌హైడ్రోజన్ వంటి చొరవలను హైలైట్ చేస్తూ, అంతర్జాతీయ సహకారం కోసం పిలుపునిచ్చారు.ఎఐ సాంకేతికత శక్తివంతమైనది అయినప్పటికీ, దాని అధిక ఇంధన వినియోగం సవాలని, దీనికి పరిష్కారంగా గ్రీన్ డేటా సెంటర్ల అభివృద్ధిని ప్రతిపాదించారు.ఈ సూచనలు భవిష్యత్-కేంద్రిత దృష్టిని, భారత్ పర్యావరణ నిబద్ధతను ప్రతిబింబించాయి. గ్లోబల్ సౌత్ దేశాల ఆకాంక్షలను మోడీ బలంగా వినిపించారు. ఆర్థిక అసమానతలు, సాంకేతిక వెనుకబాటుతనం, ఇంధన అవసరాలు వంటి సమస్యలను లేవనెత్తి, ఈ దేశాలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ఎఐ ఆవిష్కరణలలో సమన్యాయం, సాంకేతిక బదిలీ ద్వారా గ్లోబల్ సౌత్ దేశాల సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఈ ప్రతిపాదనలు భారత్‌ను అభివృద్ధి చెందుతున్న దేశాల స్వరంగా



నిలబెట్టాయి. జి-7 దేశాల నాయకుల స్పందన సానుకూలంగా ఉంది. కెనడా ప్రధాని మార్క్ కార్నీ మోడీని ఆహ్వానించడం వెనుక భారత్ పెరుగుతున్న ఆర్థిక, రాజకీయ ప్రభావాన్ని గుర్తించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన ద్వైపాక్షిక చర్చలలో పహల్గాం దాడికి ప్రతిగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరిగినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు ఉగ్రవాద నిర్మూలనకు ఐక్యత అవసరమని సమర్థించాయి. అయితే ఆంక్షల విధానంపై ఏకాభిప్రాయం సాధించడం సవాలుగా కనిపిస్తోంది. ఇంధన భద్రత, ఎఐపై భారత్ సూచనలు గ్లోబల్ సౌత్ దేశాల నుండి విశేష ఆదరణ పొందాయి. జి -7 దేశాలు సహకారం కోసం ముందడుగు వేసే సూచనలు కనిపించాయి. విశ్లేషణాత్మకంగా చూస్తే మోడీ జి-7 సమ్మిట్‌లో భారత్ జాతీయ ప్రయోజనాలను, గ్లోబల్ సౌత్ ఆకాంక్షలను సమతుల్యం చేసే ప్రయత్నం చేశారు. ఉగ్రవాదంపై దృఢమైన వైఖరి, పాకిస్తాన్‌పై విమర్శలు అంతర్జాతీయ సంఘంలో భారత్ గళాన్ని బలోపేతం చేశాయి.ఇంధన భద్రత, ఎఐపై సూచనలు భవిష్యత్-కేంద్రిత దృష్టిని సూచిస్తాయి. అయితే, ఈ ప్రతిపాదనల అమలుకు అంతర్జాతీయ సమన్వయం, రాజకీయ సంకల్పం అవసరం. జి-7 దేశాల సానుకూల స్పందన ఉన్నప్పటికీ ఆంక్షలు, సాంకేతిక బదిలీ వంటి విషయాలలో ఏకాభిప్రాయం సాధించడం సవాలుగా ఉంది. ఈ సమ్మిట్ భారత్ గ్లోబల్ లీడర్‌షిప్‌ను బలపరిచింది. ఉగ్రవాద నిర్మూలన, స్థిరమైన ఇంధనం, ఎఐ అభివృద్ధిలో భారత్ చూపిన చొరవలు ప్రపంచ శాంతి, అభివృద్ధికి దోహద పడతాయి. గ్లోబల్ సౌత్ దేశాల స్వరంగా, భారత్ ప్రతిపాదనలు సమతుల్య ప్రపంచీకరణకు మార్గం సుగమం చేస్తాయి. ఈ సమ్మిట్ ఫలితాలు భవిష్యత్ అంతర్జాతీయ సహకారానికి దిశానిర్దేశం చేస్తాయని ఆశిద్దాం.

# సింగరేణి ఆధ్వర్యంలో సంప్ స్టోరేజ్ పవర్ ప్లాంట్

హైదరాబాద్, వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా ఇప్పటికే థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పిన సింగరేణి సంస్థ మరో వినూత్న విద్యుత్ ఉత్పాదన ప్లాంట్ ఏర్పాటుకు రంగంలోకి దిగింది. సింగరేణి సంస్థ అప్పగించిన బాధ్యతల ప్రకారం వ్యాప్‌కోస్ లిమిటెడ్ సంస్థ మేడిపల్లి ఓపెన్ కాస్ట్ సంపు ఆధారంగా 500 మెగావాట్ల పంపుడు స్టోరేజ్ ప్రాజెక్ట్‌ని నిర్మించడానికి సంబంధించిన పూర్తి అధ్యయనం చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో రామగుండం-1 ఏరియాలో మూతబడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వాటర్ సంపు ఆధారంగా పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రాథమిక అధ్యయనాలు పూర్తిచేసిన కంపెనీ సంపూర్ణ ప్రాజెక్ట్ రిపోర్ట్ రూపొందించడానికి వ్యాప్‌కోస్ లిమిటెడ్ అనే ప్రభుత్వ రంగ సంస్థకు బాధ్యతలను అప్పగిస్తూ లెటర్ ఆఫ్ అవార్డును అందజేసినట్లు సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఈ తరహా ప్రాజెక్ట్ ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో ఎవరూ చేపట్టలేదని సింగరేణి సంస్థ దీనిని ప్రయోగాత్మకంగా చేపట్టడమే కాక విజయవంతంగా నిర్వహిస్తోందన్న నమ్మకం తమకు ఉందని అన్నారు. ఈ ఎ÷-లాంటును ఏర్పాటు చేయనున్న మేడిపల్లి ఓపెన్ కాస్ట్ సంపును, నిర్మాణ ప్రాంతాన్ని ఇప్పటికే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖా మాత్యులు మల్లు భట్టి విక్రమార్క సందర్శించారని, ఈ వినూత్న ప్రాజెక్టును చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. జియోలాజికల్, జియోటెక్నికల్, హైడ్రాలజీ అధ్యయనాలతో పాటు సివిల్ డిజైన్లు, ఉత్పత్తి సామర్థ్య అంశాలు మెకానికల్, ఎలక్ట్రికల్ డిజైన్లు, పర్యావరణ సంబంధ అంశాలు, రక్షణ చర్యలు వంటి విషయాలపై సమగ్ర అధ్యయనాన్ని జరిపి డీపీఆర్‌ను రూపొందించాల్సి ఉంటుంది. ఎ÷-లాంట్ నిర్మాణానికి పట్టే సమయం, నిర్మాణపు ఖర్చు, ప్లాంట్ పూర్తయిన తర్వాత ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్తు అమ్మకాలకు గల అవకాశాలు తదితర అనేక విషయాలను డీపీఆర్‌లో పొందుపరచనున్నారు. ప్రస్తుతం మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో సుమారు 157 మీటర్ల లోతున భారీ నీటి సంపు ఏర్పడి ఏడాది పొడుగునా భారీ పరిమాణంలో నీరు నిల్వ ఉంటుంది. ఈ నీటిని ఉపరితలంపై నిర్మించనున్న దాదాపు ఇదే పరిమాణం గల మరో భారీ నీటి రిజర్వాయర్ లోకి పగటిపూట సోలార్ విద్యుత్ ద్వారా పంపింగ్ జరుపుతారు. ఈ విధంగా పగటిపూట నింపిన నీటిని భారీ పైపుల గుండా రాత్రివేళ కిందికి పంపిస్తూ ఆ జల శక్తితో, మధ్యలో ఏర్పాటు చేసిన టర్బైన్లను తిప్పడంతో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. కింద ఉన్న నీటిని పైకి పంపిణీ చేసి, అలా అక్కడ నిలువ చేసిన నీటిని కిందికి పంపి విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. ఇలా చేయడాన్ని పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ అని పిలుస్తారు. మూతబడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో గల భారీ నీటి సంపు, ఉపరితలంలో రిజర్వాయర్ నిర్మించడానికి ఖాళీ ప్రదేశ లభ్యతలు ఇక్కడ ఉండటంతో సింగరేణి మొత్తంలో ఈ ప్రాజెక్ట్‌ని ఇక్కడే ఏర్పాటు చేయాలని ప్రాథమిక అంచనాకు వచ్చారు. ప్రాజెక్ట్ వ్యయం సుమారు రూ.3000 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా. అయినప్పటికీ 40 ఏళ్ల పాటు 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ పంప్డ్ స్టోరేజీ ఎ÷-లాంటు సింగరేణికి గట్టి ఆర్థిక పరిపుష్టిని కలిగిస్తుంది. వ్యాప్కోస్ లిమిటెడ్ సంస్థ డీపీఆర్ సిద్ధం చేయగానే నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలిచే అవకాశం ఉంది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఛైర్మన్, ఎండీ ఎన్. బలరామ్‌తో పాటు డైరెక్టర్ ఈ అండ్ ఎండీ. సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్వీ.సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ఎ÷-లానింగ్ కే. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్డీఎం సుభాని, జనరల్ మేనేజర్ సీపీపీ ఏ.మనోహర్, జనరల్ మేనేజర్ ÷నాన్స్ అండ్ అకౌంట్స్ ఎం. సుబ్బారావు, ఇంకా వివిధ విభాగాల కార్పొరేట్ జనరల్ మేనేజర్లు, ఏరియా, సంబంధిత జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు

# విరుచుకు పడుతున్న ఇజ్రాయిల్

టెహ్రాన్,ఇరాన్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులతో విరుచుకుపడుతోంది. ఈ దాడుల్లో ఇప్పటికే పలువురు కీలక నేతలు, అణు శాస్త్రవేత్తలను కోల్పోయిన ఇరాన్ తాజాగా మరో ముగ్గురు టాప్ కమాండర్లను కోల్పోయింది. దీంతో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కు గట్టి దెబ్బ తగిలింది. ఈ దాడుల్లో మృతి చెందిన కమాండర్లలో ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ ఆయుధ సరఫరా విభాగం కమాండర్ బెహ్నామ్ షాహ్‌రియారీ కూడా ఉన్నట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించింది. ఇజ్రాయెల్ సరిహద్దు నుంచి 1,000 కిలోమీటర్ల దూరంలోని పశ్చిమ ఇరాన్‌లో బెహ్నామ్ షాహ్‌రియారీ నడుపుతున్న వాహనంపై బాంబు దాడి జరపడంతో అతను హతమైనట్టు ఐడీఎఫ్ ధ్రువీకరించింది. ప్రాక్సీలకు ఇరాన్ ఆయుధాల స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను పర్యవేక్షించడంలో ఇతను కీలకవ్యక్తిగా ఉన్నట్టు తెలిపింది. లెబనాన్‌లో హెజ్‌బుల్లా, గాజాలో హమాస్, యెమెన్‌లో హౌతీ మిలీటియాకు నేరుగా ఆయుధాల సరఫరాలో ఇతని ప్రమేయం ఉంది. ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణల్లో ఇజ్రాయెల్ పౌరులు, సైనిక బలగాలపై ప్రయోగించిన రాకెట్లు, క్షిపణులను సరఫరా చేయడంలో సాహ్‌రియారీ పాత్ర కీలకమని ఐడీఎఫ్ తెలిపింది. కాగా, ఇజ్రాయెల్ శనివారం ఉదయం జరిపిన మరో దాడిలో ఖుద్స్ ఫోర్స్ పాలస్తీనా డివిజన్ హెచ్ సయీద్ ఇజాదీ మరణించాడు. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న మమాస్ మారణహోమానికి పాల్పడడానికి ముందు ఈ ఘటనకు ఎ÷-లానింగ్, వనరుల సరఫరా వంటివి ఇజాదీ చేసినట్టు ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. శనివారంనాడే ఇరాన్‌కు చెందిన మరో కమాండర్ అమిన్ పౌర్ జోడకీ కూడా హతమైనట్టు పేర్కొంది. ఐఆర్‌జీసీ సెకెండ్ డ్రోన్ యూనిట్‌కు ఇతను డిప్యూటీ కమాండర్‌గా ఉన్నట్టు తెలిపింది. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఈ దాడులు చేపడుతోంది.

# హామీ మేరకు రైతుభరోసా నిధులు విడుదల

హైదరాబాద్,రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఇచ్చిన హామీ మేరకు నిధలును జమ చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ముందుంటుందని అన్నారు. అన్నదాతలకు సకాలంలో వ్యవసాయ పెట్టుబడి అందేలా చేస్తున్నామని అన్నారు. శనివారం 9 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7,770.83 కోట్లు జమ చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భారాస హయాంలో రైతుబంధు నిధుల విడుదల నెలలపాటు సాగేదని విమర్శించారు. 'మేం వేగంగా రైతు భరోసా ఇస్తుంటే భారాస నేతలు డ్రామాలు చేస్తున్నారు. ఓఆర్ఆర్ లోపల సాగు భూములను గుర్తించి వాటికీ రైతు భరోసా ఇస్తాం. పంట సాగయ్యే ప్రతి భూమికి రైతు భరోసా చెల్లిస్తాం. కోతల ప్రభుత్వమనే భారాస పార్టీని ప్రజలు తిరస్కరించారు. భారాస ప్రభుత్వం రుణమాఫీని ఎన్నేళ్లలో చేసిందో గుర్తు చేసుకోవాలి' అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

# పాక్ ఎటు వైపు ?.. ఇరాన్ వైపా? అమెరికా వైపా?



ఇస్లామాబాద్:అడ్డ కత్తెరలో పోక చెక్క అనే సామెత అతికినట్లు అక్షరాలా సరిపోయే ఏకైక దేశం పాకిస్తాన్. ఎందుకంటే 2026 నోబుల్ శాంతి బహుమతికి అమెరికా అధ్యక్షుడ్ని ఎంపిక చేయాలని శనివారం (జూన్ 21) అన్న పాకిస్థాన్ ఆదివారం (జూన్ 22) మాట మార్చేసింది. ఇజ్రాయెల్ తో కలిసి ఇరాన్ పై బాంబులు వేసిన అమెరికాను వ్యతిరేకించింది. ఇరాన్ ను వెనకేసుకు వచ్చింది. దీంతో దిమ్మ తిరిగి బొమ్మ కనిపించింది అమెరికా అధ్యక్షుల వారికి. అరే ఇదేంటి.. పాకిస్థాన్ కి మనం ఇంత చేస్తుంటే అలా అనేసిందేంటని? వాపోవడం ట్రంప్ వంతు అయ్యింది. ఎవరు అవునన్నా కాదన్నా పాక్ ఇస్లామిక్ రెవల్యూషన్ కి కట్టుబడక తప్పదు. ఇరాన్ యూఎస్ రెండింటిలో పాక్ ఎటువైపు అంటే.. ఆ దేశానికున్న మత ఛాందస వాదం కారణంగా ఇరాన్ వైపు ఉండాల్సిందే. కానీ అటు అమెరికా పాక్ కి బిలియన్ డాలర్ల కొద్దీ ఇటు ఐఎంఎఫ్, అటు వరల్డ్ బ్యాంకు నుంచి నిధులు ఇప్పిస్తోంది. అంతే కాదు.. తన సొంత సంస్థ చేత కూడా పెట్టుబడులు పెట్టిస్తున్నారు ట్రంప్. ఇంత పెద్ద ఆపరేషన్ సింధూర్ తర్వాత పాక్ ఈ మాత్రమైనా కోకుకుందంటే అది అమెరికా చలవే అనడంలో సందేహం లేదు. గతంలో యూఎస్ నుంచి పూర్తి సహాయ సహకారాలను కోల్పోయాక తన భూభాగంలోని బెలూచిస్తాన్ ని పణంగా పెట్టి చైనాతో చెలిమి చేసింది. అంతేనా ఆ సమయంలో చైనా అధ్యక్షుడు పాక్ వచ్చినపుడు.. తన సోదరుడి ఇంటికి వచ్చినట్టుందని అనడం అప్పట్లో సంచలనం సృష్టించింది. పాక్.. ఒక మతమా కాదు. ఒక భావజాలమా కాదు. అయినా సరే బలూచీ- ఖనిజాల కోసం వెంపర్లాట కారణంగా చైనా-పాకిస్థాన్ తో అలాయ్ బలాయ్ అంది. ట్రంప్ వచ్చే వరకూ పాక్ వెనక ఉన్న దేశమేదైనా ఉందంటే అది చైనా మాత్రమే. చైనా అంతగా ఆర్థిక అండదండలు అందిస్తూ వచ్చింది. అయితే ట్రంప్ రెండో సారి అమెరికా అధ్యక్షుడు అయిన తరువాత స్వరం మార్చారు. ఎలాగైనా సరే పాక్ ని కంట్రోల్లో పెట్టుకుని చైనాను కట్టడి చేయాలని స్కెచ్ వేశారు. పాక్ సైతం బెలూచిస్తాన్ వేరు పడితే.. చైనా అండదండలు ఆవిరైపోతాయని తెలిసి రివర్స్ స్కెచ్ వేసి అమెరికాతో చెలిమి మొదలు పెట్టింది. అయితే.. సరిగ్గా ఈ టైంలో ఇజ్రాయెల్ ఇరాన్ వార్ లోకి దిగడం. ఆ వార్ లో ట్రంప్ ఇజ్రాయెల్ కి వంత పాడటంతో ఇప్పుడు పాక్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారింది. అయితే నైతికంగా ఎలాంటి విలువలు లేని కంట్రీ కాబట్టి.. ఈ బాయికాడ ఈ పాట- ఆ బాయికాడ ఆ పాట పాడుతూ మేనేజ్ చేస్తోంది. అందుకే ఇక్కడ ట్రంప్ కి నోబుల్ శాంతి బహుమతి ఇవ్వాలన్న నోటితోనే ఆయన బాంబులు కురిపిస్తున్న ఇరాన్ కు మద్దతుగా ప్రకటనలు గుప్పిస్తోందంటున్నారు విశ్లేషకులు.

# ఈసారి అసెంబ్లీకి జగన్ రావడం పక్కా ?



అమరావతి,అవునా ఇది నిజమేనా అంటే వైసీపీ రాజకీయం చూస్తుంటే జగన్ అసెంబ్లీకి కచ్చితంగా వస్తారని అంటున్నారు. టీడీపీ కూటమి ఏడాది పాలన ముగిసింది. జనంలో వ్యతిరేకత ఉందని వైసీపీ అంటోంది. అందుకే వెన్నుపోటు దినం నిర్వహిస్తే జనాలు తండోపతండాలుగా వచ్చారని వైసీపీ నిరసనలకు సంఘీభావం గొప్పగా ప్రకటించారని వైసీపీ నేతలు చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉంటే జగన్ మీడియా సమావేశాలు పెట్టి మరీ ప్రభుత్వాన్ని పూర్తిగా విమర్శిస్తున్నారు. ఆయన అప్పుల మీద పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలలో ఏవి నేరవేరలేదో కూడా డెమో ఇస్తున్నారు. ఏపీలో లా అండ్ ఆర్డర్ బ్రేక్ అయింది అని అంటున్నారు. ఇలా ఆయన ఎన్ని రకాలుగా విమర్శిస్తున్నా ప్రభు త్వం నుంచి సరైన సమాధానం రావడం లేదు అంటున్నారు. మరో వైపు చూస్తే గత ఏడాది కాలంగా చూస్తే కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో వ్యతిరేకత బాగా ఉందని సర్వేలు చెబుతున్నాయి. అదే సమయంలో జగన్ ఎక్కడికి వెళ్ళినా జనాలు పెద్ద ఎత్తున వస్తున్నారు. దాంతో జగన్ తనకు ఉన్న ఫార్టీ పర్సెంట్ ఓటు షేర్ కి దన్నుగా ప్రజాదరణ కూడా పెరిగింది కాబట్టి ఇక అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో విరుచుకుపడితే ఆ రిజల్ట్ వేరుగా ఉంటుందని భావిస్తున్నారు అని అంటున్నారు. అందుకే ఈసారి ఎపుడు అసెంబ్లీ సెషన్ జరిగినా జగన్ రావాలని చూస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే రెండు నెలల క్రితమే బడ్జెట్ సెషన్ పూర్తి అయింది. ఎక్కువ రోజుల పాటే బడ్జెట్ సెషన్ సాగింది. మరో వైపు చూస్తే వర్షాకాల సమావేశాలు నిర్వహించాల్సి ఉంది కానీ దానిని శీతాకాల సమావేశాలను కలిపి ఒకేసారి నిర్వహించవచ్చు అంటున్నారు. ఎలా చూసుకున్నా ఈసారి అసెంబ్లీ సెషన్ నవంబర్ లో కానీ మొదలయ్యే అవకాశాలు అయితే లేవు అని అంటున్నారు. అంటే ఇప్పటికి మరో నాలుగు నెలల సమయం అన్న మాట. అప్పటికి కూటమి ప్రభుత్వం వచ్చి దగ్గర దగ్గర ఏణ్ణర్థం అవుతుంది. మరిన్ని సమస్యలు కూడా కొత్తగా చేరుతాయని అంటున్నారు. దాంతో ఈసారి వింటర్ సెషన్ హీటెక్కిస్తుందా అన్న చర్చ అయితే సాగుతోంది. అసెంబ్లీకి వెళ్తేనే వైసీపీకి మంచి పొలిటికల్ మైలేజ్ దక్కుతుందని అంతా అంటున్న నేపథ్యం ఉంది. సొంత పార్టీలో కూడా ఇదే విషయం మీద డిస్కషన్ సాగుతోంది. అసెంబ్లీకి మరో ఏడాది పాటు అయినా వెళ్ళి చివరి మూడేళ్ళ పాటు జనంలో ఉంటే మంచి రిజల్ట్ వస్తుందని అంటున్నారు. ఒకవేళ జమిలి ఎన్నికలు వచ్చినా కూడా అసెంబ్లీకి వెళ్ళడం వల్లనే ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని అంటున్నారు. మొత్తానికి చూస్తే జగన్ ఈసారి అసెంబ్లీకి హాజరవుతారని అంటున్నారు. అందులో నిజమెంత అన్నది తెలియాలంటే అసెంబ్లీ సెషన్ మొదలు కావాల్సిందే అని అంటున్నారు.

# జూబ్లీహిల్స్ సీటు ఎవరికీ?

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కనున్నాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉపఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. గత పదేళ్లుగా బీఆర్ఎస్ అధీనంలో ఉన్న ఈ నియోజకవర్గం, తాజా పరిణామాలతో అన్ని పార్టీలకు అవకాశాలను తెచ్చిపెట్టింది.

మాగంటి గోపీనాథ్ మరణంతో ఖాళీ అయిన సీటు:

తెలంగాణ రాజకీయాల్లో మంచి పేరు సంపాదించుకున్న బీఆర్ఎస్ నేత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతితో ఈ సీటు ఖాళీ కావడంతో కొత్త అభ్యర్థి ఎంపికపై రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటివరకు తెలంగాణ రాజకీయాల్లో ఎవరైనా సిట్టింగ్ ఎమ్మెల్యే మరణిస్తే, వారి కుటుంబసభ్యులకే టిక్కెట్ కేటాయించే సంప్రదాయం ఉంది. అయితే, ఈసారి పరిస్థితులు భిన్నంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి.

బీఆర్ఎస్ వ్యూహం:

జూబ్లీహిల్స్ సీటును ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదని బీఆర్ఎస్ యోచిస్తోంది. మాగంటి కుటుంబంలో ఎవరైనా ఈ సీటుకు ముందుకొస్తే వారికే అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. ఒకవేళ కుటుంబ సభ్యులకు ఆసక్తి లేకపోతే, పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డిని బరిలోకి దించేందుకు బీఆర్ఎస్ ఆలోచనలో ఉంది. కేసీఆర్ కుటుంబంతో మాగంటికి ఉన్న సాన్నిహిత్యం, ఆయన మృతికి కేసీఆర్ కంటతడి పెట్టడమూ ఈ సీటుపై బీఆర్ఎస్‌కు ఉన్న ప్రత్యేక శ్రద్ధకు కారణంగా మారాయి.

కాంగ్రెస్ లక్ష్యం:

కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్‌ను ముఖ్యమైన లక్ష్యంగా మార్చుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ ఇక్కడ నుండి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థికి గట్టి పోటీ ఇచ్చారు. మైనారిటీ ఓట్లు ఎక్కువగా ఉండటం అజారుద్దీన్‌కు



ప్లస్ పాయింట్ కానుంది. అయితే, ఈసారి టిక్కెట్ కోసం పీజేఆర్ కూతురు విజయారెడ్డి కూడా ప్రయత్నాలు ముమ్మరం చేయడం విశేషం. ఆమె ప్రజల్లోకి వెళ్లి ప్రచారం ప్రారంభించడంతో కాంగ్రెస్‌లో టిక్కెట్ విషయంలో పోటీ పెరిగింది.

బీజేపీలో త్రిముఖ పోటీ:

బీజేపీ జూబ్లీహిల్స్ ఉపఎన్నికను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో లంకల దీపక్ రెడ్డి ఇక్కడ 25,000 ఓట్లు సాధించి పార్టీకి మంచి స్థానం తెచ్చిపెట్టారు. ప్రస్తుతం ఆయన తిరిగి బరిలోకి దిగే అవకాశం ఉన్నప్పటికీ, కీర్తిరెడ్డి, డాక్టర్ పద్మ కూడా టిక్కెట్ కోసం పోటీ పడుతున్నారు. దీంతో బీజేపీలో అభ్యర్థి ఎంపికపై ఆసక్తికరమైన పరిస్థితి నెలకొంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు మూడు ప్రధాన పార్టీల మధ్య హొరాహొరీ పోటీకి వేదికకానున్నాయి. బీఆర్ఎస్ గత విజయాలను కొనసాగించాలనుకుంటోంది. కాంగ్రెస్ ఈసారి గెలుపు సాధించాలని భావిస్తోంది. బీజేపీ సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది. ఈ మూడు పార్టీల వ్యూహాలతో జూబ్లీహిల్స్ ప్రజల తీర్పు ఏ విధంగా ఉండబోతుందో త్వరలోనే తెలుస్తుంది.

# టీడీపీలోకి మరో వైసీపీ మాజీ ఎమ్మెల్యే?



గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వైసీపీని ఖాళీ చేయించేలా వ్యూహం రచిస్తున్నారు నరసారావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయులు. గత ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి రెండోసారి ఎంపీగా గెలిచిన లావు.. గతంలో తనకు సన్నిహితంగా మెలిగిన వారిని టీడీపీలో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే జంగా కృష్ణమూర్తి, మర్రి రాజశేఖర్, మక్కిన మల్లికార్జునరావును వైసీపీ నుంచి టీడీపీలోకి తెచ్చారు ఎంపీ లావు. జంగా, మక్కెన ఎన్నికలకు ముందే వైసీపీని వీడగా, కొద్ది నెలల క్రితం మర్రిని తెలుగుదేశం పార్టీలో చేర్చుకున్నారు. ఇక ఇప్పుడు పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరి శంకరరావుపై లావు ఫోకస్ పెట్టారని అంటున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరిన నుంచి ఎంపీ లావు చాలా యాక్టివ్ గా ఉంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆయనను బాగా ప్రోత్సహిస్తున్నారని చెబుతున్నారు. దీంతో అధిష్టానం వద్ద తన పరపతిని మరింత పెంచుకోవాలనే ఉద్దేశంతో వైసీపీని టార్గెట్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వైసీపీలో తాను ఉండగా సన్నిహితంగా మెలిగిన నేతలు అందరినీ క్రమంగా టీడీపీలోకి తెచ్చేలా ఎంపీ పావులు కదుపుతున్నారని చెబుతున్నారు. 2014లో తొలిసారి నరసారావుపేట పార్లమెంటు సభ్యుడిగా గెలిచిన శ్రీకృష్ణదేవరాయులు అప్పటి సీఎం జగన్ తో మంచి సంబంధాలే ఉండేవని చెప్పేవారు. కానీ, అప్పటి మంత్రి విడదల రజినితోపాటు కొందరు వైసీపీ నేతలతో ఎంపీకి పొసిగేది కాదని ప్రచారం ఉంది. దీంతో వైసీపీలో లావు ప్రత్యేక వర్గం ఏర్పాటు చేసుకున్నారని చెబుతున్నారు. ఇక ఎన్నికల సమయంలో జగన్ తో తెగతెంపులు చేసుకున్న లావు వైసీపీలో తన వర్గాన్ని టీడీపీలోకి తెచ్చారు. అయితే కొందరు టికెట్ దక్కదనే ఆలోచనతో అప్పట్లో వైసీపీలోనే ఉండిపోగా, ప్రస్తుతం వారు కూడా టీడీపీలోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారని అంటున్నారు. మరోవైపు వైసీపీలో కమ్మ సామాజికవర్గం నేతలు ఉండకూడదా? అంటూ ఈ మధ్య పల్నాడు పర్యటనలో మాజీ సీఎం జగన్ ప్రశ్నించారు. దీనికి సమాధానంగా గతంలో తనకు ఎదురైన అవమానాలు మళ్లీ కమ్మ సామాజికవర్గం నేతలకు ఎదురుకాకూడదన్నట్లు ఎంపీ భావిస్తున్నారని, వైసీపీలో కమ్మ సామాజికవర్గ నేతలు అందరితో చర్చించి, తాను అండగా ఉంటానని వైసీపీని వీడి రావాలని పిలుపునిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఎంపీ ప్రయత్నాలను టీడీపీలో సిట్టింగు ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నట్లు చెబుతున్నారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే శంకరరావు పార్టీలోకి వస్తే తన సంగతి ఏంటని సిట్టింగ్ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ఎంపీ లావు ఎత్తుగడలు ఆసక్తికరంగా మారాయని అంటున్నారు.

# సినిమా చూపిస్తా అంటున్న గడ్కరీ



న్యూఢిల్లీ,నితిన్ గడ్కరీ బీజేపీలో అగ్రశ్రేణి నాయకుడు. ఆ పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని నిర్వహించిన వారు. సంఘీయుడు. ఆరెస్సెస్ చల్లని చూపు తన మీద ఉన్న వారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం ఆయనది. ఎంతో కీలకమైన రాష్ట్రంగా ఉన్న మహారాష్ట్ర నుంచి ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నారు. బీజేపీలో ఈ రోజు దేశాన్ని ఏలుతున్న నరేంద్ర మోడీ అమిత్ షాల ద్వయం కన్నా ఆయన సీనియర్ గా జాతీయ రాజకీయాలలో ఉన్నారు. గట్టిగా ఒక మాట చెప్పుకోవాలీ అంటే ప్రధాని మంత్రి రేసులో ఆయన ఉన్నారు. ఉదారవాద రాజకీయాలు చేస్తారు అని పేరుంది. వాజ్ పేయి కి మరో రూపుగా ఆయనను చెప్పుకుంటారు. బీజేపీతో పాటు ప్రతిపక్షంలోనూ ఆయనకు మంచి మిత్రులు ఉన్నారు అందరితోనూ మంచి రిలేషన్స్ కొనసాగించే నేతగా ఆమోదయోగ్యుడిగా గడ్కరీ ఉన్నారు. అలాంటి గడ్కరీ తాను సినిమా చూపిస్తారు అని అంటున్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్న 11 ఏళ్ళ కాలంలో తన పాత్ర కేవలం న్యూస్ రీల్ మాత్రమే అని ఆయన చెప్పడం విశేషం. ఇంకా చాలా ఉంది అని ఊరిస్తున్నారు. తాను ఏమి చేయాలన్నది పార్టీ నిర్ణయిస్తుంది అని ఆయన అంటూ ఏ బాధ్యత అప్పగించినా చేస్తాను అని చెప్పారు. తన అసలైన సినిమా కూడా తరువాత ప్రారంభం అవుతుందని ఆయన అనడం సంచలన వ్యాఖ్యలుగా చూస్తున్నారు. తాను ఇటీవల రోడ్ల అభివృద్ధి పనుల కంటే వ్యవసాయ పనుల విషయంలో ఎక్కువగా దృష్టి సారిస్తున్నాను అని ఆయన అన్నారు. విదర్భలో రైతుల ఆత్మహత్యలను ఆపేందుకు కృషి చేయాలన్నది తన కోరిక అన్నారు. ఇక 11 ఏళ్ళ మోడీ పాలన మీద ఆయన మాట్లాడుతూ ఎంతో అభివృద్ధి సాధిస్తున్నా దేశంలో ఇంకా తలసరి ఆదాయం పెద్దగా పెరగలేదు అన్నారు. తలసరి ఆదాయం అధికంగా ఉన్న తొలి పది దేశాల జాబితాలో భారత్ లేకపోవడానికి కారణం అధిక జనాభాగా చెప్పారు. అంతే కాదు జనాభా సమస్యని భాషాపరంగానో లేక మత పరంగానో చూడకుండా ఆర్థిక సమస్యగా చూడాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలో చాలా అభివృద్ధి సాగుతోందని అయితే ఫలితాలు మాత్రం అందరికీ అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే సీనియర్ నేతగా కేంద్ర మంత్రిగా ఉన్న నితిన్ గడ్కరీ సినిమా చూపిస్తాను అన్నట్లుగా చేసిన వ్యాఖ్యల మీద చర్చ సాగుతోంది. ఆరున్నర పదుల వయసులో ఉన్న ఆయనకు ప్రధాని పదవి చేపట్టడానికి చాన్స్ ఉందని అంటున్నారు. ఏడున్నర పదుల వయసులో మోడీ ఉన్నారు. వచ్చే ఎన్నికల నాటికి మోడీకి ఎనభై ఏళ్ళు వస్తాయి. మరి ఆయనకు నాలుగో సారి ప్రధానిగా చాన్స్ ఉంటుందా లేదా అన్నది బీజేపీ ఆరెస్సెస్ నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. పార్టీ ఏ బాధ్యత అప్పగిస్తే అంటూ నితిన్ చేసిన వ్యాఖ్యలలో అర్థాలను ఇక్కడే వెతుక్కోవాలని అంటున్నారు. అంటే నితిన్ ని కాబోయే ప్రధానిగా చూడొచ్చా అంటే ఏమో రాజకీయాల్లో ఎపుడేమి జరుగుతుందో ఎవరికి తెలుసు అని అంటున్నారు. సో నితిన్ ని చాన్స్ ఉందన్న మాట. అందుకే ఆయన సినిమా చూపిస్తాను అంటున్నారని చర్చ అయితే సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## హైదరాబాద్‌లో ముగ్గురు బైక్ దొంగల అరెస్ట్

హైదరాబాద్,హైదరాబాద్ లో బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు. నగరంలోని పలు చోట్లు పార్కింగ్ చేసిన బైకులను చోరీచేసి వచ్చిన డబ్బుతో ఎంజాయ్ చేస్తున్నారు. శనివారం బంజారా హిల్స్ పోలీసులు ముగ్గురు బైకు దొంగలను అరెస్టు చేశారు. వారి నుండి చోరీకి గురైన పదమూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిమ్మతి శ్రీకాంత్ (32), నవీన్ (22) వివిధ సినిమా షూటింగ్‌లలో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. నగరంలోని ప్రాంతాల్లో ఇద్దరూ నిరంతరం బైక్‌లను చోరీ చేస్తున్నారు. మూడవ నిందితుడు షేక్ కలీమ్‌కు ఈ బైకులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. శ్రీకాంత్ అనే నిందితుడు 2020 నాటి నుంచి పదే పదే బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడని పోలీసులు చెప్పారు. హైదరాబాద్ సిటీలోని వివిధ పోలీస్ స్టేషన్లలో శ్రీకాంత్ పై ఇప్పటికే ఐదు కేసులున్నాయి. చోరీకి గురైన బైక్‌లపై బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బేగంపేట, గోపాలపురం, బోరబండ, మేడ్చల్, పేట్ బషీర్‌బాగ్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

# ఫుట్బాల్ సెలక్షన్స్...





నిజామాబాద్ :జూన్ 28 నుండి జూలై ఒకటో తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలో జూనియర్ రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి జూనియర్ బాలుర ఫుట్బాల్ సెలక్షన్స్ ను ఈరోజు నల్గొండ మేకల అభినవ్ అవుట్డోర్ స్టేడియంలో ఉమ్మడి నల్గొండ జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివైఎస్ఓ మహమ్మద్ అక్బర్అలీ, గౌరవ అతిథిగా జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి గొట్టిపాటి కర్తయ్య లు మరియు ఉమ్మడి నల్గొండ జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, అధ్యక్షులు బండారు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు, అసోసియేషన్ సభ్యులు కవిత, ఓరుగంటి శ్రీనివాస్, దాసు, సునీత, ప్రవీణ్, సురేందర్, వెంకట్ గుర్రం వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొన్నారు. సెలక్షన్స్ లో దాదాపు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డివైఎస్ఓ మహమ్మద్ అక్బర్ అలీ మాట్లాడుతూ ఫుట్బాల్ సెలక్షన్స్ లో బాలురు అధిక సంఖ్యలో పాల్గొనడం ఎంతో అభినందనీయమని తెలియజేస్తూ రాబోయే రోజుల్లో జిల్లాలో క్రీడాభివృద్ధికి క్రీడాకారుల ఉన్నతికి ఒలంపిక్ అసోసియేషన్, వివిధ క్రీడా సంఘాలు, క్రీడా ప్రాకాధికారిక సంస్థలు సమిష్టిగా పనిచేస్తాయని తెలిపారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి: కార్పొరేటర్ మెట్టు కుమార్



పటాన్ చెరు, జూన్ 23: ప్రజల సమస్యలు పరిష్కరించి వారికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం ఉదయం పటాన్‌చెరు డివిజన్‌లోని శాంతినగర్, శ్రీనగర్ కాలనీతో పాటు పలు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా బ్లాక్ ఆఫీస్ ఆవరణలో ఉన్న వాకింగ్ ట్రాక్‌ను పరిశిలించారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రతీ రోజు వందలాది మంది వాకింగ్ చేసే వాకింగ్ ట్రాక్ పరిసర ప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉండాలని, ట్రాక్‌కి ఇరువైపుల పెరిగిన పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని, చెత్తాచెదారం లేకుండా చేయాలని జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా చైతన్య నగర్ కాలనీ, గోకుల్ నగర్ కాలనీ, సీతారామపురం కాలనీలలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ వ్యవస్థ పనులను పరిశీలించారు. నాణ్యతా లోపాలు లేకుండా నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్, శ్రీ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు అంజిరెడ్డి, కంజర్ల గ్రామ మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, చింతల్ బాయి సంజీవరెడ్డి, టైలర్ విజయ్, జనరల్ సెక్రెటరీ రవీంద్ర గిరి, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com